

- రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- నిషేధిత జాబితా నుంచి తొలగించిన అధికారులు
- రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు
- సుప్రీం కోర్టులో కేసు నడుస్తున్నా బేఖాతరు
- నెల్లూరు రూరల్ మండలంలో వెలుగులోకి...

ఎవరు ఎందుకు చేశారు!?

పట్టా భూములకు ఆధారాలు ఉన్నా నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అనేక కొర్రీలు పెట్టే అధికారులు దాదాపు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని మాత్రం ఆ జాబితా నుంచి తొలగించారు. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు లో సుమారు 21 ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ గతేడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడం సంచలనం రేకెత్తిస్తోంది. ఇంత పెద్ద అక్రమ వ్యవహారానికి సూత్ర, పాత్రధారులు ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది.


నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.521లో 5.20 ఎకరాలు, 525లో 2.39 ఎకరాలు, 527లో 8.59 ఎకరాలు, 529-ఎలో 4.76 ఎకరాల భూమి ఉంది. రికార్డుల్లో ఇదంతా ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. పూర్వపు ఫసలీల్లో కూడా ప్రభుత్వం, అనాధీనంగా నమోదు చేసి ఉన్నారు. అయితే కొన్ని ఫసలీల్లో అనుభవదారులుగా సర్కార్ పేపర్ మిల్లును చూపించారు. సర్కారు పేపర్ మిల్లుకు ఈ సర్వే నంబర్లకు ఆనుకొని ఉన్న 522, 523, 524, 526 సర్వే నంబర్లలో 25.29 ఎకరాల భూమి ఉంది. 1980లో సర్కార్ పేపర్ మిల్లు రైతుల నుంచి ఈ భూమిని కొనుగోలు చేసింది. ఆ తర్వాత పేపర్ మిల్లు పెట్టి నష్టాలు రావడం, రుణాలు చెల్లించక పోవడంతో బ్యాంకులు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ భూముల వేలానికి హైకోర్టు లిక్విడేటర్‌ను నియమించింది. కానీ అప్పట్లో సర్కారు పేపరు మిల్లు యాజమాన్యం వారి పట్టా భూములతో పాటు పక్కనే ఉన్న భూమిని కూడా అనుభవిస్తూ వచ్చింది. అయితే లిక్విడేటర్ ఈ మొత్తం భూమిని కలిపి వేలం వేశారు. కానీ 2004లో అప్పటి కలెక్టర్ ఈ వేలాన్ని రద్దు చేయాలని హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ప్రభుత్వ భూముల వేలాన్ని రద్దు చేసింది. కేవలం పట్టా భూమిని మాత్రమే వేలం వేసేందుకు అనుమతి ఇచ్చింది. ఆ క్రమంలో 521, 525, 527, 529-ఏ సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అప్పటి నెల్లూరు తహసీల్దార్ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే అప్పటికే ఒక సంస్థ ఈ భూమి మొత్తాన్ని వేలంలో పాడుకుంది. హైకోర్టు ఆదేశాలతో లిక్విడేటర్ సర్కారు పేపర్ మిల్లుకు చెందిన 25.29 ఎకరాల పట్టా భూమిని మాత్రమే ఆ సంస్థకు రిజిస్ట్రేషన్ చేశారు. కానీ సదరు సంస్థ మిగిలిన భూమి కూడా తమకు రిజిస్ట్రేషన్ చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికీ ఈ కేసు సుప్రీంకోర్టులో పెండింగ్ ఉంది.

● సుప్రీం కోర్టులో ఉన్నప్పటికీ..!

వేలంలో సర్కారు పేపరు మిల్లు స్థలాన్ని కొనుగోలు చేసిన సంస్థ ఆ భూమిలో మూడేళ్ల క్రితం లేఅవుట్ వేసింది. ఈ లేఅవుట్‌కు చుట్టూ ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఆ భూమి కూడా తమదేనంటూ బయట ప్రచారం చేసుకోవడంతో పాటు ఆక్రమణలు చేస్తున్నారని కొందరు స్థానికులు 2021లో అప్పటి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కానీ వారు పట్టించుకోక పోవడంతో వారు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ వేయాల్సిందిగా అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబును హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో సర్వే నెం.521, 525, 527, 529-ఎలలోని సుమారు 21 ఎకరాలు ప్రభుత్వ భూమిగా కలెక్టర్ హైకోర్టుకు తెలియజేశారు. ఆ భూమిపై వివాదం ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉందని, ఎవరూ ఆక్రమణలు చేయడం లేదని నివేదించారు. అదే సమయంలో సదరు భూమిలో బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇలా సదరు 21 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారించినా రెవెన్యూ అధికారులు ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించడం గమనార్హం. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం 22-ఏ జాబితాను సవరించింది. కొన్ని గైడ్‌లెన్స్ ఇచ్చి, వాటి ప్రకారం ఆ జాబితా నుంచి తొలగించాలని ఆదేశించింది. ప్రభుత్వ భూములను మాత్రం నిషేధిత జాబితాలో నుంచి తొలగించే అధికారం ఎవరికీ లేదు. కానీ జిల్లా అధికారులు మాత్రం నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అటు సుప్రీంకోర్టు, ఇటు హైకోర్టులో కేసులు నడుస్తున్నా లెక్క చేయకుండా బరితెగించారు. 2021, డిసెంబరులో ఆ భూమిలో బోర్డులు పెట్టిన అధికారులే.. 2022 డిసెంబరులో ఆ భూములను 22-ఏ నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు పంపడం గమనార్హం. అంతేగాక ఆ భూమి సర్కారు పేపరు మిల్లుదిగా నిర్ధారిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఎం జగన్మోహన్‌రెడ్డి పేరుతో లేఖ కూడా పంపారు. ఈ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. నిషేధిత జాబితాలో నుంచి తొలగించారు కాబట్టి సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేసేస్తే అందుకు ఎవరు బాధ్యులన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎకరా సుమారు రూ.5 కోట్లు పలుకుతుండగా మొత్తం రూ.100 కోట్ల భూమి పరులపాలయ్యే పరిస్థితి నెలకొంది. అసలు ప్రభుత్వ భూమిగా నిర్ధారించాక 22-ఏ జాబితా నుంచి ఎలా తొలగించారు? ఎందుకు తొలగించారు? ఎవరి కోసం తొలగించారు? అన్న ప్రశ్నలకు జిల్లా ఉన్నతాధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. ఎందుకంటే తహసీల్దార్ దగ్గర నుంచి కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ ఈ జాబితాపై సంతకం పెట్టి ఆమోదించనవారే.



నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడులోని ప్రభుత్వ భూమి, జగన్ సర్కారు పంపిన లేఖ (ఇన్‌సెట్‌లో)



ఇరిగేషన్ ప్రాజెక్టులపై నివేదిక సిద్ధం చేయండి

● అధికారుల సమీక్షలో మంత్రి ఆనం

నెల్లూరు (హరనాథ పురం), జూలై 12 : జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు, తెలుగు గంగ ప్రాజెక్టుల స్థితిగతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో నివేదకలు సిద్ధం చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. ఈ నెల 14న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం అధికారులతో సమీక్షించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో పెండింగ్ పనులు, మొదలు పెట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తిస్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తెలుగగంగ ప్రాజెక్టులో చేపట్టాల్సిన పనులపై కూడా సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో సోమశిల ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, జలవనరుల శాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్, కండలేరు ఎస్‌ఈ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రేపు మంత్రులు జలాశయాల పరిశీలన

సోమశిల, కండలేరు జలాశయాలను రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ఆదివారం పరిశీలించనున్నారు. సోమశిల జలాశయం సందర్శన తరువాత సోమేశ్వరాలయం, కండలేరు రిజర్వాయలర్లను వారు పరిశీలిస్తారు. ఆ జలాశయాల అభివృద్ధికి ప్రాథమికంగా చేపట్టాల్సిన పనులను ఆనం, నారాయణలు మంత్రి నిమ్మల దృష్టికి తీసుకెళ్లనున్నారు. ప్రధానంగా సోమశిల ఆప్రాన్, రక్షణ గోడ నిర్మాణ పనులు, గేట్ల మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసేలా మంత్రి నిమ్మలకు వివరిస్తారు. అనంతరం కండలేరు జలాశయ అతిథి గృహంలో జలవనరుల శాఖ అధికారులతో మంత్రులు సమీక్షిస్తారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ప్రభుత్వ భూముల్లో బినామీల పాగా!

- నకిలీ పట్టాలతో పాసుపుస్తకాలు
- ఇప్పటికే వందల ఎకరాల అమ్మకాలు
- ఇంత జరుగుతున్నా కళ్లు తెరవని రెవెన్యూ శాఖ



ప్రభుత్వ భూముల చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

ఉదయగిరి, జూలై 12 : అవన్నీ ప్రభుత్వ భూములు అయితేనేం.. బినామీ పేర్లతో పట్టాలు సృష్టించి, పట్టాదారు పాసుపుస్తకాలు కూడా పుట్టించారు. అంతేకాదండోయ్ అడంగల్, 1బీలలోనూ నమోదు చేయించారు. ఇలాంటి వందలాది ఎకరాల భూములనే రూ.లక్షలకు విక్రయించి రిజిస్ట్రేషన్లు సైతం చేయించారు. ఇలాంటి భూములను కొనుగోలు చేసిన కొందరు రాత్రికిరాత్రి కంపచెట్లను తొలగించి చదును చేయగా, మరికొందరు వాటి చుట్టూ కంచెలు ఏర్పాటుకు రాళ్లను పాతారు. జిల్లాకు విసిరేసినట్టు ఉన్న ఉదయగిరి ప్రాంతంలో ఈ భూబాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది.

● బినామీ పేర్లతో పట్టాలు

ఉదయగిరి మండలం కొండాయపాళెం మజారా కింద వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో వందల ఎకరాల భూములను స్థానికులు, స్థానికేతరుల పేర్లతో బినామీ పట్టాలు సృష్టించి గుట్టుచప్పుడు కాకుండా కొందరికి విక్రయించారు. ఒక్కో ఎకరా రూ.2.5 లక్షల చొప్పున చేతులు మారుతున్నాయి. సర్వే నెంబర్ 635/1, 2, 3, 4, 7, 956/1, 2, 957/1, 2, 3, 958/1, 2, 3, 961/1, 965/3, 970/1, 971/1, 2, 3, 1039/3, 1054/1, 1059లతోపాటు అనేక సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములను బినామీ పట్టాలు సృష్టించి అమ్మకాలు జరిపారు. ఇవేగాక వందల ఎకరాలు ప్రభుత్వ భూములకు బినామీ పట్టాలు సృష్టించినట్లు సమాచారం. కొనుగోలు చేసిన వ్యక్తులు కొందరు వీటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

● నెల్లూరు కేంద్రంగా...

కొండాయపాళెం మజారా ప్రభుత్వ భూములకు సంబంధించి గత కొన్నేళ్ల క్రితం నెల్లూరులో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. ఈ తతంగంలో భారీస్థాయిలో ముడుపులు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకులు, ఉద్యోగులు, వ్యాపారులు లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన భూముల చుట్టూ ముళ్లకంచె ఏర్పాటుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆ భూముల్లో పనులు నిరాటంకంగా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కొండాయపాళెం మజారా భూములపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కొండాయపాళెం పంచాయతీ వీఆర్వో వెంకట్‌ను వివరణ కోరగా తనకు విషయం తెలియదని రెండు రోజుల్లో పరిశీలించి వివరాలు తెలియజేస్తానని చెప్పారు.



ప్రభుత్వ భూముల్లో సాగు చేసిన జామాయిల్

డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్

నెల్లూరు (విద్య), జూలై 12 : డీఎస్సీలో పోస్టుల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ ప్రకటించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నెల్లూరులోని పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం. 83, 84, 117లను తక్షణమే రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ మాట్లాడుతూ సంక్షేమ రంగానికి ఎన్‌డీఏ ప్రభుత్వం పెద్దపీట వేయాలని ఆకాంక్షించారు. నీట్ పేపర్లను లీక్ చేసిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. వీటన్నిటిపై భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని, విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నేతలు పాల్గొన్నారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాలపై పరిశీలన



తెల్లరాయి తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు

సైదాపురం, జూలై 11 : మండల పరిధిలోని చాగణం గ్రామ ప్రభుత్వ భూముల్లో తెల్లరాయి అక్రమ తవ్వకాలపై శుక్రవారం మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ, పట్టా భూముల్లో అక్రమంగా తెల్లరాయి తరలించడంపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ మేరకు సర్వే బృందంతో విచారించామని, సర్వే పూర్తయ్యాక శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ఫిర్యాదుదారుడు బద్వేలు జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్, అటవీ శాఖ భూముల్లో రూ.50 కోట్ల విలువ జేసే తెల్లరాయిని అక్రమంగా తరలించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై 20 రోజుల కిందట తాము మైనింగ్ డీడీ కార్యాలయం చుట్టూ తిరి గినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. దీంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు అధికారుల బృందం సర్వే చేపట్టిందని అన్నారు.

ఏందుకు రాలేదు!

- పీహెచ్‌సీలలో 55 శాతం మందికే వైద్యం
- ఆర్నెల్ల తర్వాత గ్రేడ్‌లు ప్రకటించిన వైద్య ఆరోగ్య శాఖ
- జిల్లాలోని ఒక్క పీహెచ్‌సీకీ దక్కని ఏ గ్రేడ్
- బీ గ్రేడ్‌లో 19, సీ-26, డీ-4
- గ్రేడ్‌లకు దూరంగా ఏఎస్‌పేట, సౌత్‌మోపూరు, ఇస్కపాళెం

నెల్లూరు (వైద్యం) జూలై 12 : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రతినెల గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. ఎన్నికల నేపథ్యంలో 6 నెలల తర్వాత జూన్ నెలకు సంబంధించి పీహెచ్‌సీల గ్రేడ్‌లను ప్రకటించింది. బీ, సీ, డీ గ్రేడ్‌లు తప్ప ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదంటే జిల్లాలోని పీహెచ్‌సీల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది. జిల్లాలో 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా అనుమసముద్రం, సౌత్ మోపూరు, ఇస్కపాళెం పీహెచ్‌సీలు అసలు గ్రేడ్‌లకు ఎంపిక కాలేదు. ఇక్కడ ప్రజలకు వైద్యసేవలు సరిగ్గా అందడం లేదన్న విషయంపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక జొన్న వాడ, వరిగొండ, చాకిచర్ల, కలిగిరి, కుల్లూరు వంటి 19 పీహెచ్‌సీలలో అసలు ప్రసవాలే జరగలేదని ఆరోగ్యశాఖ తాజా బులెటిన్ వెల్లడిస్తుంది. ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ.30 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీ నిర్వాహణ, అత్యవసర మందుల కోసం రూ.1.75 లక్షల వంతున విడుదల చేస్తుంది. ఇంతగా కేంద్రం ఖర్చు చేస్తున్నా పీహెచ్‌సీలలో మాత్రం ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండటం లేదు.

● దక్కని ఏ గ్రేడ్!

ఆరోగ్య కేంద్రాల పనితీరులో ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలలో 285 స్థానంలో లింగసముద్రం పీహెచ్‌సీ నిలిచి, జిల్లాలో మొదటిస్థానం దక్కించుకుంది. ఇక్కడ 3074 మందికి వైద్యం, 6 ప్రసవాలు, 1,499 మందికి పలురకాల పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత 385వ స్థానంలో అనంతసాగరం పీహెచ్‌సీ జిల్లాలో 2వ స్థానం దక్కించుకుంది. రామతీర్థం, ముత్తుకూరు, సంగం, వరిగుంటపాడు, మైపాడు, మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తరువాత స్థానాలలో ఉన్నాయి. గ్రేడ్‌ల పరంగా బీ గ్రేడ్‌లో 19 పీహెచ్‌సీలు, సీ గ్రేడ్‌లో 26, డీ గ్రేడ్‌లో 4 పీహెచ్‌సీలు నిలిచాయి. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలలో 55 శాతం ప్రజలకు వైద్యసేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.



లింగసముద్రంలోని పీహెచ్‌సీ కేంద్రం



అరె పైకప్పు ఏమైంది!?

డీఎంహెచ్‌వో కార్యాలయం వెనుక పాత భవనం పైకప్పును తొలగించిన దుండగులు

దుంగల దొంగలు తెగబడ్డారు!

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణమది. ఇక్కడున్న పురాతన భవనాల్లో విలువైన టేకు దుంగలు ఉన్నాయి. అప్పట్లో టేకు దుంగలను అమర్చి ఆ తర్వాత స్లాబు వేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ దుంగల విలువ మార్కెట్లో రూ.లక్షల్లో ఉండటంతో దొంగల కళ్లు ఈ భవనాలపై పడ్డాయి. ఇంకేముంది.. కొంతమంది ఉద్యోగుల సహకారంతో చోరీకి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ రెండుసార్లు చోరీ కూడా జరిగాయి. అయినా ఆశ చావని అక్రమార్కులు పురాతన భవనాల శకలాలను తొలగిస్తూ దుంగల దొంగతనానికి మార్గం సుగమం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిఘా ఏర్పాటు చేయకపోతే విలువైన టేకు దుంగలు పరులపాలయ్యే ప్రమాదం ఉంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



టేకు దుంగల కోసం పాత భవనాన్ని పగలగొట్టిన దృశ్యం

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత



చికెన్ వ్యర్థాలను పూడ్చి వేస్తున్న పోలీసులు

సంగం, జూలై 12: అరవపాళెం సమీపంలోని చికెన్ వ్యర్థాల వాహనాన్ని శుక్రవారం సంగం పోలీసులు పట్టుకున్నారు. మండలంలో చేపల గుం టలు అధికంగా ఉన్నాయి. బెంగుళూరు, చెన్నై, కడప ఇతర ప్రాంతాల నుంచి ప్రతినిత్యం పదుల సంఖ్యలో చికెన్ వ్యర్థాల వాహనాలను మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చేపల గుంటల నిర్వాహకులు తీసుకొస్తుంటారు. ఈ వ్యర్థాల దుర్వాసనతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.. గతంలో చికెన్ వ్యర్థాలు తరలించే వాహనాలు రాత్రివేళల్లో మాత్రమే వచ్చేవి. వైసీపీ ఐదేళ్ల హయాంలో పట్ట పగలే ఈ వాహనాలు రవాణా చేస్తున్నాయి. అయినా పోలీసులు, మత్స్యశాఖ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడలేదు. వీటిపై ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ ఈసారి ఏమైయిందో ఏమో సంగం పోలీసులు చికెన్ వ్యర్థాల వాహనం పట్టుకుని కేసు నమోదు చేశారు. డ్రమ్ముల్లో ఉన్న చికెన్ వ్యర్థాలను మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి జేసీబీతో గుంటలు తీసి పూడ్చి వేశారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో చికెన్ వ్యర్థాల వాహనాలు వస్తున్న ఓ వాహనాన్ని పట్టుకోవడంలో అంతర్యం ఏమిటని స్థానిక రైతులు, ప్రజలు గుసగుసలాడుతున్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్)/మనుబోలు : భార్యపై హత్యాయత్నం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో భర్త ఇందూరుపల్లి చినరాజయ్యకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా కోర్టు (ప్రత్యేక మహిళా కోర్టు) న్యాయాధికారి జి.గీత శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మనుబోలు మండలం కొండుపాళెం గ్రామానికి చెందిన నిందితుడు హజరత్తయ్య మద్యానికి బానిసై తన భార్య రాజేశ్వరిని నిత్యం మానసికంగా శారీరకంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో అమెపై అనుమానం పెంచుకుని 2015 అగస్టు 16వ తేదీ రాత్రి అమెపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ మేరకు మనుబోలు ఎస్ఐ నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై హత్యాయత్నం చేసినట్లు నేరం రుజువు కావడంతో పై విధంగా జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వీవీ ప్రసాద్ వాదించారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

● మరో ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

నెల్లూరు(క్రైం), జూలై 12 : నెల్లూరు నగర పరిధిలో శుక్రవారం వేర్వేరు చోట్ల రైలు ఢీకొన్న ఘటనలలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసుల కథనం మేరకు.. నగరంలోని రంగనాయకులపేట రైల్వే గేటు వద్ద గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు వయస్సు 55-60 ఏళ్ల మధ్య ఉంటుందని, పింకు కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, తెలుపు, బులుగు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జిజమాలకొండయ్య సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

సౌత్ రైల్వే స్టేషన్ వద్ద..

నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆంబులెన్స్‌లో జీజీహెచ్ తరలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు.

బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూలై 12: బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టురోడ్డుపై శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గూడూరుకు చెందిన సునీల్, శ్రీనివాసులు పని నిమిత్తం పోర్టుకు వెళ్లి మోటార్ బైక్‌పై వస్తుండగా సర్వేపల్లి రైల్వే గేటు సమీపానికి వచ్చేసరికి ఎదురుగా ఒక్కసారిగా వాహనం రావడంతో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. ఈప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరిని చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ పనుల్లో నిధుల స్వాహా!



పనుల్లో జరిగిన అవినీతిపై ప్రశ్నిస్తున్న యువత

అనంతసాగరం, జూలై 12: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో పెద్దమొత్తంలో నిధులు స్వాహా అయినట్లు అధికారులు గుర్తించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల సామాజిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ సభ్యులు గ్రామాల్లో జరిగిన అవినీతిబా గోతం బయటపెట్టారు. 25గ్రామ పంచాయతీల్లో ఏడాది పాటు రూ.12 కోట్ల ఉపాధి పనులు జరిగాయి. చేసిన పనులకు సంబంధించిన ఆడిట్ నెలరోజుల పాటు నిర్వహించారు. ఈ క్రమంలో తనిఖీ సభ్యులు గుర్తించిన అక్రమాలు మండల సదస్సులో వెల్లడించారు. అనంతసాగరం, రేవూరు, పీకేపాడు, బొమ్మవరం గ్రామాల్లో పనికి రాని వారి పేర్లతో పనులు చేసినట్లు దొంగ మస్టర్లు తయారు చేసి నిధులు భారీగా స్వాహా చేశారని, రికార్డు పరంగా చేసిన పనులకు క్షేత్రస్థాయి పరిశీలన చేసినప్పుడు పొంతన లేదని సిబ్బంది తెలిపారు. అనంతసాగరం చెరువు పరిధిలోని కాలువల పూడికతీత పనులు చేసినట్లు రికార్డులో నమోదు చేసిఉండగా కాలువలో నీరుందని మరి కొలతలు ఎలా తీసి కూలీలకు పేమెంట్ చే శారని స్థానికులు అధికారులను నిలదీశారు. కేవలం అనంతసాగరలోనే లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయినట్లు వాటిని రికవరీ చేసి ఫీల్డ్ అసిసెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీకేపాడు వివరాలు వెల్లడించే క్రమంలో స్థానిక నాయకులు పనుల్లో జరిగిన అవినీతిపై అధికారులను నిలదీశారు. పలుమార్లు ఫీల్డ్‌అసిస్టెంట్ అక్రమాలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆగ్రహించారు. మండల సదస్సు ఆలస్యంగా ప్రారంభం కావడంతో రాత్రి వరకు సమీక్ష జరిగింది. కార్యక్రమంలో అడిషనల్ పీడీ లక్ష్మీదేవి, ఏపీడీ శంకర నారాయణ, జిల్లా విజిలెన్స్ అదికారి శ్రీనివాసులు, ఈఈ వేణుగోపాల్ అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి , ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఏపీవో దయాసాగర్ ఉన్నారు.

లైంగిక దాడి కేసులో 10 ఏళ్ల జైలు

● రూ.25 వేల జరిమానా

నెల్లూరు(లీగల్), జూలై 12 : ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు గంగపట్నం కుమార్‌కు పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని రాఘవరెడ్డి కాలనీలో ఓ మహిళ తన 5 ఏళ్ల కుమార్తెను 2017వ సంవత్సరం జనవరి 21వ తేదీన తన తల్లి వద్ద వదలి కూలి పనులకు వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన నిందితుడు గంగపట్నం కుమార్ ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని 23వ తేదీన తెలుసుకున్న సదరు బాలిక తల్లి బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా జైలు శిక్ష తోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శైలజారెడ్డి వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6977
వెండి కిలో ధర	రూ. 94,700
వెండి ఒక గ్రాము	రూ. 96.70

'వైసీపీ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యేల సిఫారసులతో డిప్యుటేషన్, ఫారెన్ సర్వీసుల్లో వచ్చి చేరాము. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ఇక్కడే ఉందామా!? లేదా వెనక్కి వెళ్లిపోదామా!? ఒకవేళ ఉంటే ఇబ్బందులు పడతామో మో. ప్రాజెక్ట్ లో నుంచి తిరిగి పాఠశాలలకు వెళ్లిపోతే మంచి దేమో'

– సమగ్ర శిక్షలో కొంతమంది అధికారుల డైలమా ఇది

ఉందామా.. వెళ్లిపోదామా!?

● 'సమగ్ర శిక్ష'లో అడ్డదారి ప్రవేశాలు ● వైసీపీ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యేల సిఫారసులు

● ఎన్నికల్లో వైసీపీ రుణం తీర్చుకునేలా ప్రచారం

● ప్రభుత్వం మారడంతో వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు



నెల్లూరు (విద్య), జూలై 12 : జిల్లా విద్యా శాఖ పర్యవేక్షణలో నడిచే సమగ్రశిక్ష ప్రాజెక్ట్‌లో ఉండే సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు కొన్నాళ్లుగా సందిగ్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమకు ఉన్న పరిచయాలతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, నియోజకవర్గ నాయకులతో పైరవీలు చేసుకుని అర్హత లేకున్నా ప్రాజెక్ట్ కార్యాలయంలో తిష్ట వేశారు. జిల్లా సరిహద్దు స్కూళ్లలో పనిచేయాల్సిన కొంతమంది, పొరుగు జిల్లాల నుంచి కొంతమంది కలెక్టర్, జేసీ, డీఈఓలపై ఒత్తిడి తీసుకువచ్చి సమగ్రశిక్షలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఎవరూ అడగరన్న ధీమాతో తమకు నచ్చిన విధంగా విధులు నిర్వహించడంతోపాటు కొంతమంది చేతివాటం కూడా ప్రదర్శించారు. సమగ్రశిక్షలోని ఓ విభాగం పర్యవేక్షించిన ఓ మహిళా అధికారిని అవకతవ కలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో రాష్ట్ర అధికారులే సమగ్ర శిక్ష నుంచి తప్పించి పాఠశాలకు వెళ్లమని ఆదేశాలిచ్చారు. అయితే సదరు అధికారిణి సమగ్రశిక్ష ఉన్నతాధికారిని, డీఈఓను, రాష్ట్ర ఉన్నతాధికారిని సైతం బెదిరింపులకు గురిచేయడంతో పాటు కోర్టును ఆశ్రయిం చినట్లు సమా చారం. నేటికీ తాను పాఠశాలలో చేరకుండా తిరిగి సమగ్ర శిక్షలోకి వచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు కార్యాలయ వర్గాలు చెపుతున్నాయి. అలాగే మరో అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారిని ఏకంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వు లిచ్చారు. అయితే సదరు అధికారి తన రాజకీయ పలుకు బడితో సస్పెన్షన్‌ను ఎత్తి వేయించుకుని మరీ ప్రాజెక్ట్‌లో చక్రం తిప్పుతున్నారు. తాజాగా ప్రభుత్వం మారడం, ఎక్కడ తమకు ఇబ్బందులు ఎదురవుతాయోనన్న భయంతో కొంత మంది వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, లాబీయింగ్‌లు నడిపే అధికారులు మాత్రం వారి ప్రయత్నాలు చేస్తూ ప్రస్తుత అధికార పార్టీ నేతల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరి కొంతమంది ప్రాజెక్ట్ నుంచి వెళితే తిరిగి తమకు మంచి స్థానాల్లో పోస్టింగ్ ఉంటుందో లేదోనన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

● వైసీపీ మద్దతుదారులు రీప్యాట్రేషన్‌కు సన్నద్ధం

సమగ్రశిక్షలోకి వచ్చిన కొంతమంది అధికారులు వైసీపీకి పావులుగా పని చేశారు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా ప్రాజెక్ట్‌లోకి వచ్చిన వీరంతా ఎన్నికల సమయంలో వైసీపీ తరఫున ప్రచారాలు సైతం చేశారు. రాజకీయ విందు, వినోదాల్లో పాల్గొనడంతోపాటు మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమేనంటూ తమదైన శైలిలో కార్యాలయంలో అందరినీ తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేశారు. అయితే అందరి లెక్కలను తారుమారు చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ మద్దతు అధికారులు, సిబ్బంది రివర్స్‌గేర్ తీసుకుని ప్రస్తుతం అధికారపార్టీ నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరి కొంత మంది మాత్రం రీప్యాట్రేషన్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వీరిలో కొంతమంది సర్వీసు పూర్తి చేసుకోగా, మరి కొంతమందికి ఇంకా సర్వీసు ఉంది. అయినా సరే తమ పాత స్థానాలకు వెళ్లేందుకు కొంతమంది సముఖత చూపుతుండగా, వైసీపీ నేతల అండదండలతో దొడ్డిదారిన వచ్చిన వారు మాత్రం డైలమాలో ఉన్నారు. ఇప్పటికే వీరి జాతకాలన్నీ ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు, కలెక్టర్ వద్ద ఉండగా, ప్రాజెక్ట్‌లో రాజసానికి అలవాటు పడిన అధికారులు మాత్రం కొత్త ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తూ వారి ప్రసన్నం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు వీరిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో, లేక వీరినే కొనసాగిస్తే వేచి చూడాల్సిందే.

కొత్త పెన్షన్ విధానం

రద్దు చేయాలి

బిట్రగుంట, జూలై 12: రైల్వే కార్మికులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్యాంచ్ ఛైర్మన్ మద్దిబోయిన వెంకట శేఖర్ డిమాండ్ చేశారు. బిట్రగుంట మజ్దూర్ యూ నియన్ బ్యాంచ్ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యూనియన్ నేతల ఆదేశాల మేరకు పీడబ్ల్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. అలాగే సీఅండ్ డబ్ల్యూ, క్రూ కంట్రోల్ లాబీ కార్యాలయల వద్ద యూనియన్ సభ్యులు కార్మికులతో ఆందోళన చేపట్టారు.

అల్లూరు 'పెద్దోడు'కి జాతీయస్థాయి పురస్కారం



అవార్డును స్వీకరిస్తున్న బడబాగ్ని ఆంజనేయరాజు

అల్లూరు, జూలై 12: అల్లూరు 'పెద్దోడు'గా పేరొందిన బడబాగ్ని ఆంజనేయరాజుకి జాతీయ పురస్కారం లభించింది. రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన ఏకపాత్రాభినయం పోటీల్లో ఆయనకు తృతీయ స్థానం లభించింది.

అక్రమ లేఅవుట్ ప్లాట్లలో హద్దురాళ్ల తొలగింపు



అక్రమ లేఅవుట్‌లోని ప్లాట్ల హద్దురాళ్లు తొలగించిన అధికారులు

పొదలకూరు, జూలై 12: భూమిని కన్వర్షన్ చేయకుండానే ఆర్డీవో పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి కన్వర్షన్ జరిగినట్లు చూపి పట్టణంలో నెల్లూరు మెయిన్ రోడ్డుకు ఆనుకుని స్వర్ణా గార్డెన్స్ పేరుతో వేసిన లేఅవుట్ ప్లాట్లలో హద్దురాళ్లను ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ దర్శి దొరబాబు, తోడేరు పంచాయతీ సెక్రటరీ మాధవ్ శుక్రవారం తొలగించారు. దీని విస్తీర్ణం 18.44 ఎకరాలు కాగా, ఇదంతా అడంగళల్లో వ్యవసాయ భూమిగానే ఉంది. కనీసం వ్యవసాయేతర భూమిగా మార్చలేదు. దీంతో వారు లే అవుట్‌లోని ప్లాట్లలో హద్దురాళ్లను తొలగించారు.

ఏపీ రీసెర్చ్ కామన్ పరీక్షలో ప్రతిభ

బిట్రగుంట, జూలై 12: బోగోలు మండలం ఎస్వీపాలెం పంచాయతీకిం చెందిన కట్టిపల్లి సింహాద్రి భవానీల కుమారుడు శ్రావణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షలో రెండో ర్యాంక్ సాధించాడు. ఉద్యోగం చేస్తూ సామాజిక కార్యక్రమాలు చేస్తున్న సింహాద్రి, మాజీ రాష్ట్ర ఉపాధిహామీ కౌన్సిల్ మెంబరుగా ఉన్నా భవానీలకు సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగాడు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడారు. యూనివర్సిటీ స్కాలర్‌గా ఉంటూ సివిల్స్‌లో ర్యాంక్ సాధించడమే తన ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.


డిజిటల్ అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

కలిగిరి, జూలై 12: ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ వార్డు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలని కలిగిరి, కొండాపురం, వింజమూరు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు శుక్రవారం వింజమూరు తాలూకా ఏపీఎన్‌జీఓస్ (ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్‌అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్స్) అధ్యక్షుడు వెలుగోటి మధు ఆధ్వర్యంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

చదువుతో పాటు సమాజంపై అవగాహన



జలదంకి: రికార్డులు పరిశీస్తున్న విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు శారదాకుమారి

జలదంకి, జూలై 12: చదువుతో పాటు సమాజంపై అవగాహన కల్పించేది ఉపాధ్యాయుడే అని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు శారదాకుమారి తెలిపారు. శుక్రవారం జలదంకిలోని ఎంఈఓ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు శ్రీధర్, నాగేశ్వరరావులను విద్యాకిట్లు పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిశీలకురాలు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సీఎంఓ చెంచురామయ్యతో కలసి జలదంకి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నభోజనంను తనిఖీ చేశారు. హైస్కూల్‌లో విద్యాకిట్ల నాణ్యతపై ఆరాతీశారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి ఉన్నారు.

దుమారం రేపిన ఇసుక అక్రమ రవాణా

అనంతసాగరం, జూలై 12: అనుమతులు లేకుండా.. బిల్లులు ఇవ్వకుండా పడమటికంబంపాడు రీచ్‌లో రెండు రోజుల పాటు గోప్యంగా జరిగిన ఇసుక అక్రమ రవాణా వెలుగులోకి రావడంతో దుమారం లేపింది. కొందరు నాయకులు రెండురోజుల్లోనే రూ.60 లక్షలకు పైగా నగదును పోగేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

రీచ్‌ను పరిశీలించిన ఏడీ

పడమటికంబంపాడు రీచ్‌ను జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచనలిచ్చారు. రీచ్‌లోకి వాహనాలు రాకుండా గోతులు తీయాలని ఆదేశించారు. పోలీసు సిబ్బందిని పహారా ఏర్పాటు చేశారు. సోమశిల ఎస్ఐ సుబ్బారావు పర్యవేక్షించారు.

సోమశిలలో 9.939 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 12: సోమశిల పూర్తిసాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి డ్యాంలో 9.939 టీంఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 117 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 600, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

జగనన్న పథకాలు అమలు చేయొద్దు

కావలి, జూలై 12: ప్రజల వ్యతిరేకతను కూడా పట్టించుకోకుండా గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేప ట్టిన పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠాశాల్లోనే కలపా లని కోరారు. ఈ మేరకు శుక్రవారం కావలి ఉపవిద్యాధికారి కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.రవికుమార్, శ్రీనివాసులు, ముక్కు మోహన్‌రావు, నూనె శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), జూలై 12 : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఇందుకూరుపేట ఎంకేఆర్ పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి దాసరి విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీలు బరువు కలిగిన వారు ఆధార్ కార్డుతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన పురుష, మహిళా క్రీడాకారులు ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు ఇందుకూరుపేట ఎంకేఆర్ పాఠశాల క్రీడామైదానంలో జరిగే మహాలక్ష్మి మెమోరియల్ 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

నెల్లూరు కమిషనర్‌గా మహిళా ఐఏఎస్?

నెల్లూరు (సిటీ), జూలై 12 : నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా మహిళా ఐఏఎస్ అధికారిని ఖరారు చేసినట్లు సమాచారం. విజయవాడలో ఉంటున్న ఆమెను నెల్లూరు కమిషనర్‌గా నియమించాలని అధికార పార్టీలో దాదాపు కసరత్తు పూర్తయినట్లు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఈమె ఏపీ కేడర్‌లో పని చేస్తున్నారు. ఈ మహిళ అధికారి గతంలో కందుకూరు సబ్‌కలెక్టర్‌గా కూడా పని చేసినట్లు సమాచారం. 8 లక్షల జనాభా కలిగిన నెల్లూరుకు ఐఏఎస్ అధికారితో పాలన సాగించాలని టీడీపీ భావిస్తోంది. కాగ ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలు కలెక్టర్ ఆనంద్ స్వీకరించారు.

సబ్ జూనియర్ జంప్‌రోప్ జిల్లా జట్టు ఎంపిక



జంప్‌రోప్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

కావలిటౌన్, జూలై 12: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సబ్ జూనియర్ జంప్‌రోప్ జిల్లా జట్టు ఎంపిక జరి గింది. జంప్‌రోప్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలో జిల్లా నలుమూలలనుంచి 60మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఎంపికైన జట్టు ఈనెల 27, 28తేదీల్లో నంద్యాలలో జరిగే (రాష్ట్రస్థాయి) అంతర్ జిల్లాల జంప్‌రోప్ పోటీలో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను పీడీలు చిరంజీవి, చంద్రిక, శివకుమార్‌రెడ్డిలు అభినందించారు.

ముంగమూరులో మట్టి తవ్వకాలు

బిట్రగుంట, జూలై 12: ముంగమూరు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. అధికారులు నోరు మెదపక పోవడం, కొందరు పోలీసుల పరోక్ష సహకారంతో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసు కుని రైతులు, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకో వాలని కోరుతున్నారు.

పొదుపు మహిళలను ప్రమాదబీమా పథకాల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ టిఎస్ ప్రదీప్‌కుమార్

ఆత్మకూరు, జూలై 12: పొదుపు మహిళలకు ప్రమాదబీమా పథకాలపై అవగాహన కల్పించాలని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ టీఎస్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవరాం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో మెప్మా సిబ్బంది, ఆర్పీలు, సీవో, సిఎంఎంలతో సమీక్ష నిర్వహించారు. పీఎంజేబీవై, సీఎంఎస్‌బీవై పథకాల్లో పొదుపు మహిళల కుటుంబసభ్యులందరినీ చేర్పించాలని సూచించారు. 18 నుంచి 70ఏళ్లలోపు వారు 20 రూపాయలు పీమియం చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాదబీమా వర్తిస్తుంద న్నారు. పీఎంజేబీవై పథకం ద్వారా రూ.436 చెల్లిస్తే సహజ మరణాలకు రూ.2లక్షలు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బిఎల్ సురేంద్ర, ఐబీ అంకయ్య, సీవో మాధవి పాల్గొన్నారు.

హైద్రాబాద్‌లో ప్రతిభ చాటిన సంయుక్త నృత్యకారులు

కావలి టౌన్: హైదరాబాద్‌లో జరిగిన మనం ఫౌండేషన్ వార్షికోత్సవ వేడుకల్లో సం యుక్త చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. శుక్రవారం తెలంగాణ సారస్వత పరిషత్‌లో శ్రీనివాస కల్యాణం నృత్యరూపకంతో చిన్నారులు ప్రతిభ చాటి కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, సినీ నటులు సుమన్, గజల్ శ్రీనివాస్, మనం ఫౌండేషన్ అడ్వొకేట్ చక్రవర్తి నుంచి అభినందనలు అందుకున్నారు. కావలికి చెందిన సంయుక్త నృత్య కళానిలయం నాట్యాచారిణి గంగపట్నం లిఖిత పర్యవేక్షణలో 16మంది నృత్యకారిణులు పాల్గొన్నారు.

టిడ్కో నివాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

కావలి : మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహాలలో నివాసం ఉంటు న్న వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం డీఈ సాయిరాంతో కలిసి కమిషనర్ టిడ్కో గృహాల వద్దకు వెళ్లారు. గురువారం కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకట క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సంగం: 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్ పనులతో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయగిరి రూరల్: సబ్‌స్టేషన్‌లో నెలకొన్న మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఖుద్దూస్‌భాష ప్రకటనలో తెలిపారు.

వింజమూరు: పట్టణంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రింటర్ అందజేత



ప్రింటర్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జూలై 12: స్థానిక ఉన్నత పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ మండల కన్వీనర్ యర్రా చిన్నబ్రహ్మయ్య పాఠశాలకు ప్రింటర్‌ను వితరణ చేశారు. శుక్రవారం నెల్లూరుజిల్లా పార్లమెంట్ యువత కార్యదర్శి ఎంఎంకె చౌదరి ఈ ప్రింటర్‌ను హెచ్‌ఎం వీరభద్రయ్యకు అందజేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు ప్రింటర్‌ను ఇవ్వడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, నాయబ్‌రసూల్, పోలిబోయిన కొండయ్య, అజయ్‌యాదవ్, మదన్‌యాదవ్, రామకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీపై ఫిర్యాదు

ఏఎస్ పేట, జూలై 12: గుడిపాడు ఎంఎల్‌హెచ్‌పీపై శుక్రవారం మాజీ వైస్ ఎంపీపీ దేవరాల హజరత్తయ్య ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యురాలు మంజులకు ఫిర్యాదు చేశారు. గుడిపాడులో అనారోగ్యంతో ఉన్న ఓ వ్యక్తికి సాయంత్రం ప్రాథమిక వైద్యం కోసం స్థానిక ఎంఎల్‌హెచ్‌పీఈ, ఏఎన్‌ఎంలను సంప్రదించగా వారు అందుబాటులో లేరు. ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తెలిపారు. విషయంపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు.

స్కూల్ కిట్స్ అందజేత



విద్యా సామగ్రిని తరలిస్తున్న టీచర్లు

సీతారామపురం, జులై 12: స్టూడెంట్ కిట్‌లో భాగంగా సీతారామపురం ఏపీ మోడల్ స్కూల్ స్టాక్ రూంలో ఉంచిన 1899 స్కూల్ కిట్స్‌ను శుక్రవారం సీతారామపురం, అయ్యవారిపల్లి, బసినేనిపల్లి, ఓగూరువారిపల్లి కాంప్లెక్స్ పరిధిలోని 40పాఠశాలలకు ఎంఈఓ మస్తాన్‌వలి పంపిణీ చేశారు. మధ్యాహ్నం 1.30నుంచి అయ్యవారిపల్లి, బసినేని పల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలో పిల్లలకు బ్యాగ్స్ ష్యూస్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయనతో సీఆర్పీలు కులారి వెంకటేశ్వర్లు, ఆవుల వెంకటేశ్వర్లు, విజయ్ భాస్కర్, జయరావ్, సిబ్బంది రమాదేవి ఉన్నారు.

ఆలయ స్థలం పరిశీలన

ఉదయగిరి రూరల్, జూలై 12: పట్టణంలోని ఆనకట్ట సమీపంలోని గంగమ్మ ఆలయ స్థలాన్ని శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో మధులత పరిశీలించారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానిక రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట తహసీల్దారు నెహ్రూబాబు, సర్వేయరు రవి, వీఆర్వో వెంకట్ ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలి

వింజమూరు: డిజిటల్ అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెలుగోటి మధు డిమాండ్ చేశారు. పట్టణంలోని తెలుగుదేశం కార్యాలయంలో శనివారం ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి ఎన్జీవో నాయకులు డిటిటల్ అసిస్టెంట్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలి

ఆత్మకూరు, జూలై 12: విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ నేతలు పనిచేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర తెలిపారు. స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారక భవన్‌లో శుక్రవారం సంఘం పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ ఖాదర్‌బాష, ఎన్ చక్రి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా శ్రీను, కార్తీక్, భరణి, మనోజ్‌తోపాటు ఏడుగురు సభ్యులుగా ఉన్నారు.

'నేను బడికిపోతా' ర్యాలీ

కలువాయి, జూలై 12: తెలుగురాయపురంలో శుక్రవారం నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎంఈవో-2 శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, మస్తాన్‌బాబు, పాల్గొన్నారు.

సంగం: స్థానిక విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో నేడి బడికిపోతా కార్యక్రమంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బడిఈడు పిల్లలందరూ బడిలో చేర్పిదాం అని నినాదాలు చేశారు. చివరలో ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జానికీరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారు శివనాగిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 12: మున్సిపాలిటీలోని 15వ వార్డు పరిధిలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుని జేసీబీతో చదును చేస్తుండగా శుక్రవారం టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి స్థానికులతో అక్కడికి కలిసి వెళ్లి పనులను అడ్డుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ నేతలతో కలిసి కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తిప్ప పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి సొమ్ము చేసుకునేందుకు విక్రయిస్తారని పేర్కొన్నారు. ఈ విషయంలో న్యాయం చేయాలని కోరారు. గతంలో కొందరు వైసీపీకి చెందిన వారు ఆక్రమించుకొని లక్షల రూపాయలు సొమ్ము సమస్యను రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి స్థానిక గిరిజనులకు చెందేలా చూడాలని కోరతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మంగమ్మ, రమణమ్మ, లక్ష్మీ, సునీత, మహిళలు పాల్గొన్నారు.

పశుగ్రాసం విత్తనాలు పంపిణీ



మొక్కజొన్న ప్యాకెట్లను అందుకుంటున్న రైతులు

మర్రిపాడు, జూలై 12: స్థానిక సచివాలయంలో శుక్రవారం పశు సంవర్థక శాఖ ఏడీ గురుజయంతి పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. పాడి రైతులకు మొక్కజొన్న, జొన్న 5కేజీల బ్యాగులను సబ్సిడీతో అందజేశారు. ప్రస్తుతం 500కేజీలు జొన్న, 500కేజీలు మొక్కజొన్న ఉందన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.

సీతారామపురం: పబ్బులేటిపల్లి రైతుసేవా కేంద్రంలో శుక్రవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పశు పోషకులకు పశువుల ఆరోగ్యం, పోషణ యొక్క ప్రాముఖ్యత, మన ప్రాంతంలో పశువుల మేతకు లభ్యం అయ్యే వివిధరకాల గడ్డి జాతులు, పశువులకు జీవాలకు పోషణలో ఆవశ్యకత గురించి పశువైద్యాధికారి అనూష వివరించారు. రైతులకు ప్రభుత్వ సబ్సిడీపై అందించే గడ్డి విత్తనాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులకు ఖనిజ లవణ మిశ్రమం, బి.కాంప్లెక్స్ టానిక్ అందజేశారు. కార్య క్రమంలో పబ్బులేటిపల్లి సర్పంచ్ ఆదినారాయణ, చిన్ననాగంపల్లి ఉప సర్పంచ్, రైతు సేవ కేంద్ర సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్లు మహేశ్వరి, గౌస్, నరేష్ పాల్గొన్నారు.

14న సోమశిల, కండలేరుకు మంత్రుల రాక



రీచ్‌ను పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

అనంతసాగరం, జూలై 12: సోమశిల, కండలేరు జలాశయాలను ఈ నెల 14 రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు సందర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పా ట్లు చేస్తున్నారు. సోమశిలలో వరదకు దెబ్బతి న్న కట్టడాలు, ధ్వంసమైన సోమేశ్వరుడి ఆల యం పరిశీలిస్తారు. అనంతరం తెలుగుగంగ, సోమశిల అధికారులతో స్థానిక అతిథిగృహంలో సమీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నెల్లూరుకు చేరుకొని బారాషాహిద్ దర్గాను దర్శించుకొని రొట్టెల పండుగ ఏర్పాట్లు పరిశీలన చేస్తారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆరోగ్య వైద్యాధికారి వెంకటసుబ్బయ్య

ఉదయగిరిరూరల్, జూలై 12: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్య సేవలు పొందాలని ఎంఈవో శ్రీనివాసులు, గండిపాళెం ఆరోగ్య వైద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి



బైక్ ర్యాలీలో పాల్గొన్న హనుమాన్ భక్త బృందం సభ్యులు

ఆత్మకూరు, జూలై 12: పట్ట ణంలో ఈ నెల 21న నిర్వహించ నున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని హనుమా న్ భక్త బృందం, హిందూ చైతన్య వే దిక నాయకులు పిలుపునిచ్చారు. శుక్ర వారం హనుమాన్ భక్త బృందం ప ట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అ నంతరం ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, ఏఎస్ఆర్, ఎస్‌వీఎస్ఆర్‌జె డిగ్రీ కళాశా లలకు వెళ్లి విద్యార్థులను ఆహ్వానించారు. రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరూ కార్యక్రమంలో వేడుకల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, బీజేపీ నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్, కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్, హనుమాన్ భక్త బృందం సభ్యులు మాధవరెడ్డి, వేము శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరు, జూలై 12: నువ్వూరుపాడు, బట్టేపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు పంటసాగు హక్కుపత్రాల మంజూరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ కౌలురైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి, పంట నష్టపరిహారం, పంటల బీమా, సబ్సిడీ విత్తనాలు, సీసీఆర్‌సీ కార్డులను గురించి తెలిపారు. వీఆర్వో ద్వారా ఈ పత్రాలను పొందే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, నువూరుపాడు సర్పంచ్ కటారి దొరసానమ్మ, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెలే కాకర్ల ఆర్థిక సాయం



బాధితుడి బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, జులై 12: పట్టణంలోని స్టేట్‌పేట ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఇండ్ల అంకయ్య ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్ర వారం రాత్రి ఎమ్మెల్యే ఇండ్ల సుబ్ర హ్మణ్యం నివాసానికి వెళ్లి ఆయన చేతుల మీదుగా రూ.10వే లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరా మిరెడ్డి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సరసమైన ధరల్లో నాణ్యమైన సరుకులు

- రాయితీ కందిపప్పు స్టాల్ ప్రారంభం
- కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



రైతుబజారులో స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 12: సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ రైతుబజారులో రాయితీపై ఇచ్చే నిత్యావసర సరుకుల కౌంటర్‌ను శుక్రవారం కావలి ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ ఎం.వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ నగేష్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్ ధరకన్నా తక్కువ ధరకు ప్రభుత్వం ఇచ్చే బియ్యం, కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత రైతుబజారులోని దుకాణాలన్నింటినీ పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

● ఆక్రమణలను తొలగించండి

రైతుబజారు ముందు వినియోగదారులు పార్కింగ్ చేసుకునే స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతుబజారు, పోలీస్‌స్టేషన్లలోకి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్ర మిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. రైతుబజారులోని సమస్యలను పరిష్కరించి ఆధునీకరించాలన్నారు.

● అన్నా క్యాంటీన్ భవనం పరిశీలన

ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న అన్నా క్యాంటీన్ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగ స్టు 15నుంచి 30లోపు ఈ క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. కావలిలో ఒంగోలు బస్టాండ్ సెంటర్ లేదా పెద్ద పవని బస్టాండ్ సెంటర్‌లో మరో క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

జాతీయవాదం పెంపొందేలా 100అడుగు జెండా

ట్రంకురోడ్డులోని అమృత్‌పథకం పైలాన్ స్థూపాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కూల్చి వేయించారన్నారు. ఆ ప్రదేశంలో సొంత నిధులతో 100 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేసి ఆగస్టు 15లోపు ప్రారంభిస్తానన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ డీఈ సాయిరాం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, బీజేపీ నేతలు వెంకటసత్యనారాయణ, గుండ్లపల్లి భరత్‌కుమార్, జనసేన నాయకులు పొబ్బా సాయి విఠల్, సమ్మన వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ధృడ సంకల్పంతోనే సత్ఫలితాలు : ఎమ్మెల్యే కావ్య

కావలి టౌన్: విద్యార్థులు ధృడ సంకల్పం కలిగివున్నపుడే సత్ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పుల్లారెడ్డినగర్‌లోని శ్రీవశిష్ట జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన తరగతుల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు. ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన శ్రీపూజిత తదితర ర్యాంకర్లను వారు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అల్తాఫ్, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జోతి బాబురావు, అర్షియా, బీజేపీ నేత భరత్‌కుమార్, జనసేన నేత సాయి పాల్గొన్నారు.

చినపవని చెరువు అలుగు మరమ్మతులకు చర్యలు

- మైనర్ ఇరిగేషన్ ఏఈఈ ప్రసాద్

లింగసముద్రం, జూలై 12: చినపవని సాగునీటి చెరువు అలుగును తాత్కాలిక మరమ్మతులు చేసేం దుకు చర్యలు తీసుకుంటామని మండల మైనర్ ఇరి గేషన్ ఏఈఈ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. ఏడాది క్రితం పెదపవని గ్రామానికి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చెరువు వెనుక భాగంలో తమ పొలాలు మునిగిపోతున్నాయని ఈ చెరువు అలుగు పగులకొట్టారని అప్పట్లో ఏఈఈ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెరువులోకి నీరు చేరి వృధాగా పోతోందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ టీడీపీ నేతలు సోంపల్లి మనోహర్, రవీంద్ర, బ్రహ్మయ్య మరికొందరు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వివరించారు. దీంతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు తగిన చర్యలు తీసుకోవాలని ఏఈఈ ప్రసాద్‌ను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఏఈఈ ప్రసాద్ సాగునీటి చెరువు అలుగును పరిశీలించి ప్రస్తుతం తాత్కాలికంగా అలుగు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే రైతుల వినతి మేరకు చెరువుకు ఉత్తర భాగంలో శిథిలావస్థలో ఉన్న వంతెనను ఆయన పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు వివరించి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

కౌలురైతులకు పంట రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు దుర్గేశ్వరరావు

అల్లూరు, జూలై 12 : సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకూ పంట రుణాలు ఇచ్చేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకుందని తహసీల్దారు దుర్గేశ్వరరావు తెలిపారు. అల్లూరు సచివాలయం-1 లో శుక్రవారం ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. కౌలు రైతుల పంట రుణాలు ఇచ్చేందుకు భూ యజమానుల నుంచి భూమి తాలూకు వెబ్‌ల్యాండ్ రికార్డు, ఆధార్‌కార్డులను తీసుకు రావాలన్నారు. దీనితో భూ యజమానులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, సదరు రుణం కేవలం కౌలు రైతులకు మాత్రమే వర్తిస్తుందే తప్ప భూ యజమానికి వర్తించదని స్పష్టం చేశారు. రాయితీ ద్వారా అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ సామగ్రి అందజేస్తామన్నారు. కార్యక్ర మంలో డిప్యూటీ తహసీల్దారు నాగలక్ష్మి, కార్యదర్శి వరప్రసాద్, వీఆర్వో రంతుల్లా పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆక్రమణలు తొలగింపు



కావలి, జూలై 12: పట్టణ రైతుబ జారు ముందు ఉన్న ఆక్రమణలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రమే మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాబూ రావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య పెంచాలి



కందుకూరు, జూలై 12: కందుకూరు మున్సిపాలిటీలో పారిశుధ్యం, ఇంజనీరింగ్ విభాగాలలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య పెంచాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో పెరిగిన జనాభా, పెరిగిన నివాస ప్రాంతాలను బట్టి కార్మికుల సంఖ్యను 150కి పెంచాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్మికుల మస్టర్ పాయింట్‌లో కనీసం గది కూడా లేనందున ఎండకు, వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీరు, టాయిలెట్ సౌకర్యం కూడా లేకపోవటం శోచనీయమని, తక్షణం తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. పారిశుధ్య నిర్వహణలో ఉపయోగిస్తున్న ఆటోలు, ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని, కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన సదుపాయాలన్నీ అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఎస్ఏ గౌస్, సురేష్, ఆనంద్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పరిశీలన

కొండాపురం, జూలై 12: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీచేసిన స్టూడెంట్ కిట్స్ రాష్ట్ర అబ్జర్వర్ శారద శుక్రవారం మండలంలో పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసిన కిట్లలో అన్ని వస్తువులు ఉన్నాయో లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రానికి వెళ్లి వివరాలను ఎంఈవో-2 ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు 3,230 స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలుసుకున్నారు. ఆమె వెంట సీఎంఓ పెంచలయ్య, ప్రధానోపాధ్యాయులు రహీమ్, ఖాదర్‌భాషా, సీఆర్‌ఎంపీ అయ్యన్న తదితరులు ఉన్నారు.

ఇంటిపన్ను అక్రమ వసూళ్లపై ఫిర్యాదు

అల్లూరు, జూలై 12: నార్తుమోపూరులో ఇంటిపన్ను అక్రమ వసూళ్ల పంచాయతీ కార్యాలయంలోని ఓ ప్రైవేటు ఉద్యోగి నిర్వాహకమే అని కార్యదర్శి వరప్రసాద్ తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు. స్థానికులు కొంతమంది గురువారం నగర పంచాయతీ కమిషనరు ఫణికుమార్‌కు వినతిపత్రం ఇచ్చిన విషయం విదితమే. ఈ మేరకు స్థానికంగా అలజడి నెలకొంది. దీంతో తనపై కొంతమంది ఫిర్యాదు చేయడంతో కార్యాలయంలో విచారించగా జరిగిన విషయం తెలుసుకు న్నట్లు కార్యదర్శి తెలిపారు. ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు

వలేటివారిపాలెం, జూలై 12: మండలంలోని పోలినేనిపాలెంలో సర్పంచ్ అనుమోల అమరేశ్వరి శుక్రవారం విద్యుత్ సిబ్బందిచే వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధిలైట్లు మరమ్మతులకు గురైై గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీధిలైట్లకు మరమ్మతులు చేయించినట్లు సర్పంచ్ అమరేశ్వరి తెలిపారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల మంజూరు

లింగసముద్రం, జూలై 12: నిబంధనల మేరకు కౌలు రైతులకు పంట సాగుదారుని హక్కు ధ్రువీకరణ పత్రం కార్డులు (సీసీఆర్‌సీ) మంజూరు చేస్తామని మండల వ్యవసాయ అధికారి అబ్రహంలింకన్ చెప్పారు. శుక్రవారం ముత్యాలపాడు, పెద పవని గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్డులు పొందిన రైతులు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు పంట నష్ట పరిహారం పొందుటకు, ఈ-క్రాప్ నమోదు చేసుకొనుటకు అర్హులవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్‌వోలు హనుమల్ల, వినోద్, విఏఏలు ప్రేమ్‌బాబు, నజీర్ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: అర్హత కలిగిన కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు వీఆర్వోలకు సూచించారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఓ హేమంత్‌భరత్ కుమార్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బిట్రగుంట: జక్కేపల్లి గూడూరు పంచాయతీలోని సోమేశ్వరపురంలో రైతులకు కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. తహసీల్దారు వెంకటరత్నం, మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి, నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వ ర్లురెడ్డి, జక్కేపల్లి గూడూరు, ఏబీకండ్రిక, ఎస్‌జీవీ కండ్రిక సర్పంచులు బండ్ల సురేష్ గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే బోగోలు బిట్-1, నాగులవరం పంచాయతీలో జరిగిన కార్యక్రమానికి కావలి ఏడీఏ నాగరాజు, డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయ్, ఆర్ఐ, వీఆర్వోలు, వీఏఏలు ఉన్నారు.

● కావలి రూరల్ : గౌరవరంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూశాఖ అధికారులు శుక్రవారం పంటసాగు హక్కుపత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి లలిత మాట్లాడారు.

'పాలిటెక్నిక్'లో డీబీఎస్ విద్యార్థుల ప్రతిభ

కావలి టౌన్, జూలై 12: డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాలలో అభినందించారు. ప్రిన్సిపాల్ శ్యాసుందర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీబీఎస్ ప్రిన్సిపాల్ టీవీ రావు, ఏవో రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కందుకూరు, జూలై 12: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కోసం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కందుకూరు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని టౌన్ ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

● లింగసముద్రం : వీఆర్ కోట, లింగసముద్రం సబ్‌స్టేషన్లలో మెయింటెన్స్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ షేక్ ఫిరోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. లింగసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, వీఆర్ కోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఫిరోజ్ తెలిపారు.

● వలేటివారిపాలెం : పోకూరు, నలదలపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శింగమనేనిపల్లె, నలదల పూరు, కళవళ్ల, నూకవరం, పోకూరు, నేకునాంపురం, కాకుటూరు, బడేవారిపాలెం గ్రామాలలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏఈ మధుబాబు తెలిపారు

● బిట్రగుంట : జక్కేపల్లిగూడూరు, వడ్డిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం శనివారం విద్యుత్ కోత ఉంటుందని మండల విద్యుత్‌శాఖ అధికారి నాగూర్‌వల్లి తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటూరికి ఘన సన్మానం



ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న బధిరులు

కందుకూరు, జూలై 12: దివ్యాంగుల పింఛన్‌ను ఒకేసారి 3వేలు నుంచి 6వేల రూపాయలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని బధిరుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు కృతజ్ఞత తెలుపుతూ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శుక్రవారం స్థానిక కార్యాలయంలో బధిరులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు, జూలై 12: గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు చెందిన పిల్లలు బడికి దూరంగా ఉంటున్నారని, వారిని గుర్తించి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ఉపాధ్యాయుల బాధ్యత అని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తనవంతుగా పైనంపురం సంగం గిరిజన కాలనీ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పరిరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలన్నారు. అనంతరం స్కేటింగ్‌లో అవార్డులు అందుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, గొలగమూడి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్‌యాదవ్, మునిరెడ్డి, అబ్దుల్ షఫీవుల్లా, కోదండయ్య, ప్రదీప్‌రెడ్డి, ముత్యంగౌడ్, రమేష్‌శర్మ, శివకృష్ణ, శ్రీనివాసులు, అతిముత్తు, మత్స్యకార నాయకులు ఏడుకొండలు, రమణయ్య, యల్లయ్య, బుజ్జిబాబు, జనసేన నాయకులు సురేష్‌నాయుడు, బీజేపీ నాయకులు రవీంద్రరెడ్డి, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరు: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

సబ్సిడీ బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం

పొదలకూరు: పట్టణంలోని రైతుబజార్‌లో శుక్రవారం సాయంత్రం బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు ఆర్డీవో మాలోలా కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిపప్పు, బియ్యం తక్కువ ధరకే ఈ విక్రయ కేంద్రంలో ఇస్తారని తెలిపారు. పొదలకూరు, మనుబోలులో త్వరలో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటుచేస్తామన్నారు. ప్రతి మండలంలో సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శివనాయక్, వాసు, ఆనంద్, మార్కెటింగ్ శాఖ ఏడీ అనితా కుమారి, తహసీల్దారు శివకృష్ణ, ఎంపీడీవో మహ్మద్ రఫీ, మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బి మల్లికార్జున్ నాయుడు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి నేతల చిత్రపటాల బహూకరణ



డిప్యూటీ సీఎం చిత్రపటాన్ని సచివాలయ ఉద్యోగులకు అందిస్తున్న నాయకులు

పొదలకూరు, జూలై 12: మండలంలోని ఆర్‌వై పాలెం సచివాలయానికి ఆగ్రామానికి చెందిన జనసేన నాయకుడు నారదాసు రవి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిత్రపటాలను శుక్రవారం అందజేశారు. ఎన్డీఏ కూటమి ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైపాలెం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పూజలు



మహాలక్ష్మమ్మకు పూజలు చేస్తున్న ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, జూలై 12: మండలంలోని యల్లాయపాలెం గ్రామంలో మహాలక్ష్మమ్మ మహోత్సవం పురస్కరించుకుని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పూర్ణకుంభంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొని స్వయంగా వడ్డించారు. అనంతరం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, ఏకొల్లు వంశీధర్‌రెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్, బడుగు శ్రీనివాసులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో బహుళ ప్రయోజనాలు



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న ఏవో రఘునాథరెడ్డి

ఇందుకూరుపేట, జూలై 12: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి డి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వీఆర్‌వోలకు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు, రైతులకు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రఘునాథరెడ్డి మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని, సొంత పొలం లేని కౌలు చేసుకునే రైతులకు 11నెలల కాల పరిమితితో సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వడం జరుగుతుందని, ఈ కార్డులను వరి, ఉద్యానవన పంటలకు కూడా ఇవ్వడం జరుగుతుందని రైతులకు వివరించారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన వారికి, వ్యవసాయ శాఖ పెట్టుబడి సాయం కింద రైతుభరోసా నిధులు మంజూరుచేయడం జరుగుతుందన్నారు. కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందించడానికి సులభతరం అవుతుందని, ముఖ్యంగా పంట నష్టపరిహారానికి, వ్యవసాయ శాఖ అందించే అన్నిరకాల పథకాలకు సీసీఆర్‌సీ కార్డు ఉపయోగపడుతుందని తెలియజేశారు. అర్హులైన రైతులు గ్రామాల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం రమేష్‌కుమార్, వీఏఏ నవీన్, వీహెచ్‌ఏ మాదయ్య, రైతులు పాల్గొన్నారు.

●బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని పంచేడు, మినగల్లు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో కౌలు పంట సాగుదారు హక్కు ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతు కార్డులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మనుబోలు, జూలై 12: డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రామ్ అధికారి డా. పీఎల్ దయాకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. చలి, జ్వరం, ఒళ్ళునొప్పులు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నివాసాల్లో వాడేసిన కొబ్బరికాయలు, టైర్లు, ఇతర వ్యర్థ పదార్థాలు నిల్వ ఉంటే దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలే అవకాశముందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందన్నారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మొహసీనా సుల్తానా, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



నరసింహమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

కోవూరు, జూలై 12: స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెలలో పదవీ విరమణ పొందిన ఎస్ నరసింహమూర్తిని గురువారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజనబాబురెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ తలపల వేణుగోపాల్, టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాల పంపిణీ



తోటపల్లిగూడూరు : పాడి రైతులకు గడ్డి విత్తనాలు అందజేస్తున్న పశువైద్యులు

తోటపల్లిగూడూరు, జూలై 12: పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పొట్టపూడి గ్రామంలో పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. పశు వైద్య ఉపసంచాలకులు డాక్టర్ నాగమణి చేతుల మీదుగా పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పశువైద్య సహాయకులు అందుబాటులో ఉంటూ పశువైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ బి మురళీకృష్ణ, ఇందుకూరుపేట ప్రాంతీయ పశువైద్యశాల డాక్టర్ అస్లాం అత్తర్, షైపాడు, తదితరులు పాల్గొన్నారు.

●పొదలకూరు: మేలైన పశుగ్రాసంతో మంచి పాల దిగుబడి లభిస్తుందని పశు సంవర్థక శాఖ పొదలకూరు ఏడీ కె అరుణ అన్నారు. మండలంలోని మరుపూరు గ్రామీణ పశువైద్యశాలలో శుక్రవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం సబ్సిడీపై రైతులకు గడ్డి విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.శిరీష, జేవీవో డానియేల్, గోపాలమిత్ర శ్రీను, పాడి రైతులు, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

సైదాపురం, జూలై 12: కైవల్యా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం అర్ధరాత్రి పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసు కుంటామన్నారు.

కబ్జాకు గురైన భూమి పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 12: బుచ్చి నగర పంచాయతీ 3వ వార్డులోని అంబేడ్కర్ నగర్ బైపాస్‌రోడ్డు నుంచి రేబాలకు వెళ్ళే మార్గంలోని కృష్ణా థియేటర్ పక్కన ఇస్కపాళెం రెవెన్యూ పరిధిలోని 30 సెంట్లు ఇరిగేషన్ (కాలువ పోరంబోకు) భూమి కబ్జాపై బీజేపీ నాయకుడు గంజం పెంచలప్రసాద్ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు త్వరలో సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆసుపత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 12: బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేలా అభివృద్ధి చేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆసుపత్రితోపాటు రోగుల కోసం దాతలు ద్వారా దొడ్ల కోదండరామిరెడ్డి అందజేసిన ఎక్సరే, స్కానింగ్ పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మావతితో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో పలు విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి రొట్టెలు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. జనరేటర్ లేదా ఇన్వర్టర్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌ను సందర్శించి, ఎంపీ వేమిరెడ్డి సహకారంతో కొత్త భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. బేసుమట్టాలకే పరిమితమైన నగర పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనుల పూర్తికి కమిషనర్‌ను ఆదేశించారు. కాగా, రక్తహీనతతో బాధపడుతున్న ఓ గిరిజన గర్భవతికి ఎమ్మెల్యే సహకారంతో టీడీపీ నాయకుడు రామానాయుడు ద్వారా 10 వేల సాయం చేశారు. ప్రభుత్వాసుపత్రి ఎదుట అందరికీ అందుబాటులో బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు ప్రదేశంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కమిషనర్‌ను ఆదేశించారు. త్వరలో తిరుపతి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరికరంతో కోవూరు నియోజకవర్గ మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, హరికృష్ణ, ఎంవీ శేషయ్య, బి.మురళీకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, కత్తి మహేష్, హరనాథ్, ఉసురుపాటి, నందకుమార్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

● భక్తులకు ఇబ్బంది కలిగించొద్దు!

జొన్నవాడ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలిగించేలా వాహనాలు ఆలయం దాకా కాకుండా రథం కూడలివరకే అనుమతించాలని ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిన షెడ్డు' కథనం పాఠకులకు విదితమే. అలాగే భక్తుల ఫిర్యాదుల మేరకు శుక్రవారం ఆమె ఆలయాన్ని పరిశీలించారు. షెడ్డుకింద ఇరువైపులా వ్యాపారాలను ఓ క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందుగా అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, స్వామిఅమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

పంచాయతీ రిసోర్స్ భవన నిర్మాణం పూర్తి చేయండి : కలెక్టర్

నెల్లూరు(జడ్పీ), జూలై 12: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న పంచాయతీ రిసోర్స్ సెంటర్ భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికా రులు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం రిసోర్స్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవనానికి ఫ్లోరింగ్, పార్కింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విజయ డెయిరీ చైర్మన్

నెల్లూరు(హరనాథపురం) : విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఎండీ కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కోనోకార్పస్ చెట్లు తొలగించండి

నెల్లూరు(క్రైం) : ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఏడాకుల (కోనోకార్పస్) చెట్లను తొలగించాలని కోరుతూ జనసేన నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జనసేన నాయకుడు టోనీబాబు మాట్లాడుతూ దక్షిణ అమెరికాకు చెందిన కోనోకార్పస్ జాతి మొక్కల్ని సుందరీకరణ కోసం వాడుతున్నారని, వాటి వలన భూగర్భ జలాలు తగ్గిపోతాయ న్నారు. ప్రజల ఆరోగ్యానికి ఈ చెట్లు ప్రమాదమని ఓ అధ్యయనంలో తేలిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఈ చెట్లను రాష్ట్ర వ్యాప్తంగా తొలగించాలని ఆదేశించారని, జిల్లాలోనూ పూర్తిగా తొలగించాలని కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జనసేన నేతలు

ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ నివారణ

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య

● నగరంలో కాలువలను పరిశీలించిన వైద్యాధికారులు

నెల్లూరు(వైద్యం), జూలై 12 : ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని కుక్కల గుంట ప్రాంతంలోని కాలువలను ఆయన పరిశీలించారు. కాలువల్లో చెత్త పేరుకుపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని, వెంటనే వీటిని శుభ్రం చేయాలని సచివాలయ శానిటరీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ నిల్వ చేరే వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వారానికోసారి ఇంట్లో పాత్రలను శుభ్రపరిచి ఎండ బెట్టాలన్నారు. తద్వారా లార్వాదశలోనే దోమలను నిర్వీర్యం చేయవచ్చని వెల్లడించారు. డెంగ్యూతో పాటు మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల రాకుండా చూడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్‌కృష్ణ, మలేరియా సహాయ అధికారి నాగార్జున, కోటమిట్ట ఆరోగ్య కేంద్రం కో ఆర్డినేటర్ తిరుపతయ్య, ఆరోగ్య కార్యదర్శి చాముండేశ్వరి, స్వప్న, భవాని తదితరులు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న వైద్యం బృందం

రొట్టెల పండుగ విజయవంతం చేస్తాం

● ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



దర్గాలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12 : బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగను అందరి సహకారంతో విజయవంతం చేస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన బారాషహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ ఏర్పాట్లను నాయకులు, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. మతసామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ జరిగే బారాషహీద్ దర్గా తన నియోజకవర్గంలో ఉండడం నా అదృష్టం అన్నారు. ఈ రొట్టెల పండుగ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు షేక్.ఖాదర్‌బాషా సుదీర్ఘ రాజకీయ అనుభవజ్ఞుడు మాత్రమే కాక దైవభక్తి కలవాడని, ఆయన నేతృత్వంలో ఈ పండుగ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, మైనార్టీ నాయకులు సయ్యద్ సమీ హుస్సేన్, షంషుద్దీన్, సాబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

లేక్యూ కాలనీలో ఆక్రమణలపై కమిటీ

నెల్లూరురూరల్ : నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని పొదలకూరు రోడ్డు లేక్యూ కాలనీ వద్ద నెల్లూరు చెరువు ఆక్రమణలపై కమిటీ ఏర్పాటైందని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆక్రమణల గుర్తింపునకు సంబంధిత శాఖలతో కూడిన అధికారులందరూ ఈ కమిటీలో ఉంటారని వెల్లడించారు. వారంత శనివారం లేక్యూ కాలనీలోని ఆక్రమణలను గుర్తించి తదుపరి నివేదికను ఉన్నతాధికారులకు అందించి ఆపై ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

కోటంరెడ్డి సోదరుల చిత్రపటాలకు పాలభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని 31వ డివిజన్ కొత్తూరులో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ముస్లిం నాయకులు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుల చిత్రపటానికి పాలభిషేకం చేశారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీ ఖాదర్‌నవాజ్ ఈద్గా స్థలాన్ని పెట్రోలు బంకు ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా కోటంరెడ్డి సోదరులు మైనార్టీలకు అండగా నిలపడ్డారని టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు ఆషిక్ తెలిపారు. జమీర్, బషీర్, కరిముల్లా, జున్ను, మునీర్, ఖాదర్ పాల్గొన్నారు.

టీపీవో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలి

నెల్లూరు(హరనాథపురం), జూలై 12 : టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరుతూ ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతికి సీపీఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు వాటంబేటి నాగేంద్ర మాట్లాడుతూ పొగతోటలో ఒక వ్యక్తి పూర్వార్జిత స్థలంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని, దానిని మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశాడని ఆరోపించారు. అతను పంట కాలువపై పిల్లర్లు వేసి మూడంతస్తుల వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్నాడని తెలిపారు. ఈ అక్రమ నిర్మాణంలో టౌన్ ప్లానింగ్ అధికారి పాత్ర ఉందని ఆరోపించారు. అక్రమ నిర్మాణ దారుణ్ణి టౌన్ ప్లానింగ్ అధికారి కాపాడుతున్నాడని ఆరోపించారు. లీలామోహన్, నరసింహారావు, సునీల్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు క్వాడీ సైన్స్ చైర్ బహూకరణ

నెల్లూరు(వైద్యం), జూలై 12: ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో ఫిజియోథెరపీకి సంబంధించి క్వాడీ సైన్స్ చైర్‌ను పవన్ కృష్ణ జ్యూయలర్స్ నిర్వాహకుడు దగ్గుబాటి సురేష్ తన కుమారుడు సీఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినందుకు నిర్వాహకులకు అందించారు. శుక్రవారం రెడ్‌క్రాస్ చార్టెడ్ అకౌంటెంట్ చలపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కేంద్రం ప్రిన్సిపాల్ గురునాథరావుకు ఈ చైర్‌ను అందించారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేషకుమార్ జైన్, సభ్యులు యలమూరి రంగారావు, దాసరి రాజేంద్రప్రసాద్, చామర్తి జనార్ధన్‌రాజు, దివ్యాంగుల కేంద్రం కో కన్వీనర్ బలరామయ్యనాయుడు, రెడ్‌క్రాస్ కార్యాలయం కార్యదర్శి మస్తానయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆర్‌ఐలకు డివిజన్ల మార్పు

● పాత తేదీలతో ఉత్తర్వులు

నెల్లూరు(సిటీ), జూలై 12 : కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో ఇద్దరు ఆర్‌ఐలకు డివిజన్లు మార్పు చేస్తు గురువారం ఉత్తర్వులు బయటకు వచ్చాయి. కృపాకర్ ఆర్‌ఐగా ఉన్న పలు డివిజన్లను మరో ఆర్‌ఐ సునీల్‌కు కేటాయించారు. వీటిని ఈనెల 9వ తేదీన జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నగా కమిషనర్ వికాస్‌మర్మత్ రిలీవ్ అయ్యాక బయటకు రావడం గమనర్హం. కమిషనర్‌ను బదిలీ చేస్తు ప్రభుత్వం జీవో జారీ చేసింది కూడా 9వ తేదీనే కావడం విశేషం.

ట్రిపుల్‌ఐటీకి మున్సిపల్ పాఠశాల విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూలై 12 : ప్రతిష్ఠాత్మకమైన ట్రిపుల్‌ఐటీకి నగరంలోని సీబీ నగర్ ఎంసీహెచ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీహెచ్.జైసాయి నాగేంద్ర, పీ.హరి వెంకట తరుణ్, ఎం.ప్రజ్ఞశ్రీ, ఎస్.రాణిలు ఎంపికయ్యారు. దీంతో వారిని శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఈ.జాస్మినమ్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్లీపురం నుంచి తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభించిన నాయకులు

నెల్లూరురూరల్, జూలై 12 : సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం సాధిస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తామన్న మొక్కును తీర్చుకునేందుకు 2వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం అల్లీపురం నుంచి తిరుమల పాదయాత్రను మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మేకల అనిల్, అజయ్‌కుమార్‌రెడ్డి, బాలమురళీ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌ల నూతన కార్యవర్గాలు ప్రమాణ స్వీకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12 : నగరంలోని రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్, రోటరీ క్లబ్ నెల్లూరు శక్తి, నెల్లూరు అవెన్యూస్ క్లబ్‌ల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.చందర్, గెస్ట్ ఆఫ్ హానర్‌గా డి.భరత్‌కుమార్, ఆత్మీయ అతిథిగా ఒమ్మిన సతీష్‌కుమార్ పాల్గొని 3 క్లబ్‌ల నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యద ర్శులుగా శ్రీహరి, మల్లికాబేగం, రోటరీశక్తి క్లబ్‌కు అధ్యక్ష,కార్యదర్శులుగా సుమంకిత, పావనిరెడ్డి, రోటరీ నెల్లూరు అవెన్యూస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కృష్ణచైతన్య, కళాకృష్ణస్వామి ప్రమాణ స్వీకారం చేశారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

నెల్లూరు(క్రైం), జూలై 12: బైక్, స్కూటర్ నడిపేవారు, వెనుక కూర్చొనే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీనియర్ సివిల్ జడ్జి వాణి తెలిపారు. జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం రహదారి భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ హెల్మెట్లు బైక్ రైడర్లకు అత్యంత ముఖ్యమైన భద్రత సామగ్రి అన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జ్యుడిషియల్ మ్యాజిస్ట్రేట్ రైల్వేస్ వినోద్ కుమార్, ఉపరవాణా కమిషనర్ చందర్ పాల్గొన్నారు.

బోధన సిబ్బందిని నియమించండి

నెల్లూరు(విద్య), జూలై 12 : నగరపాలక సంస్థ పాఠశాలల్లో బోధనా సిబ్బందిని నియమించాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవోను కలిసి కోరారు. పాఠశాలల్లో బోధన సిబ్బంది తక్కువగా ఉన్నారని, తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మరుగుదొడ్ల నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. దీనిపై డీఈవో రామారావు స్పందిస్తూ ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు ఇప్పటికే జాబితా సిద్ధమైందుని, త్వరలోనే అన్ని పాఠశాలల్లో టీచర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణితో కలిసి సమస్యలు వివరించారు. పాఠశాలల్లో బెంచీల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణాలపై పాఠశాల కమిషనర్‌కు విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గునుకుల కిషోర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

నెల్లూరు(విద్య), జూలై 12 : నగరంలోని వీఆర్ హైస్కూల్ క్రీడామైదానంలో టీడీపీ నాయకుడు అన్నంగి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొంగూరు నారాయణ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో లగాన్ జట్టుపై నవాజ్ జట్టు విజయం సాధించింది. లగాన్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి నారాయణ సతీమణి రమాదేవి పాల్గొని విజేతలకు రూ.20 వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేల, షీల్డ్ అందచేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 12: ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చి కిత్స పొందుతున్న యువ కుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కోవూరు గుమ్మళ్లదిబ్బకు చెందిన కిరీటి (21) పోతి రెడ్డిపాలెంలోని ఇటుక బట్టీల్లో కూలి పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7వ తేది రాత్రి ట్రాక్టర్‌లో సంతపేటకు ఇటుకలలోడు తీసుకు వచ్చారు. ఇటుకలను అన్ లోడ్ చేసి తిరిగి ఇంటికి బయలుదేరారు. సాలుచింతల మగర్ ఫ్యాక్టరీ సమీ పంలోకి వచ్చేసరికి ట్రాక్టర్ తొట్టిపై కూర్చోని ఉన్న కిరిటీ అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయాలు కావడంతో సహచరులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్త్రీ శిశు సంక్షేమ శాఖలో విచారణ

నెల్లూరు(హరనాథపురం) : స్త్రీ శిశు సం క్షేమ శాఖలో పదోన్నతుల వ్యవహారంపై ఆర్జేడీ చర్యలకు ఉపక్రమించారు. ఇక్కడ నలుగురు ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు పొందడమేగాక అధిక జీతా న్ని డ్రా చేస్తు న్నట్లు గుర్తించారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవా ల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అధికంగా పొందిన జీతాన్ని కూడా రికవరీ చేయాలని పేర్కొన్నారు.

- చంద్రబాబు హయాంలోనే నిధులు.... పనులు
- గత ప్రభుత్వంలో పూర్తిగా స్తంభించిన పనులు
- రూ. 2500 కోట్లతో పూర్తి కావాల్సిన కాంట్రాక్టు రద్దు

- రూ. 5 వేల కోట్ల అంచనాతో ప్రత్యామ్నాయ ప్రణాళిక
- పరిశీలనలోనే ముగిసిపోయిన పుణ్యకాలం


బాలాజీ రిజర్వాయర్ వద్ద పనులాగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనం

గాలేరు-నగరిపై మళ్లీ ఆశలు

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అనకాపల్లి జిల్లా దార్లపూడిలో పర్యటించిన సందర్భంగా ఆ ప్రాంత ప్రజలకు మాట ఇచ్చారు.అన్ని రంగాల్లో వెనుక బాటుతనానికి గురైన ఉత్తరాంధ్ర ప్రజలకు న్యాయం చేయాల్సిందే. అయితే సొంత జిల్లాలో ఐదేళ్ళుగా అతీగతీ లేకుండా పోయిన గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు విషయంలోనూ


చంద్రబాబు హయాంలో జరిగిన బాలాజీ రిజర్వాయర్ కట్ట పనులు

జిల్లా ప్రజలు ఆయన నుంచీ ఇదే ప్రాధాన్యతను కోరుకుంటున్నారు. 1985 నుంచీ జిల్లా వాసులను ఊరిస్తున్న గాలేరు-నగరి ప్రాజెక్టును దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఏ ముహూర్తాన ప్రకటించారో గానీ అప్పటి నుంచీ ఏదో ఒక అడ్డంకి ఎదురవుతూనే వుంది. రామారావు తర్వాత ఎందరో ముఖ్యమంత్రులు మారినా పనులు మొదలైంది మాత్రం చంద్రబాబు హయాంలోనే. గత ఐదేళ్ళు వైసీపీ ప్రభుత్వంలో పనులు స్తంభించడమే కాక మునుపటి కాంట్రాక్టును రద్దు పరిచి డిజైన్ సైతం మార్చేశారు. ఇపుడు మళ్ళీ చంద్రబాబు సీఎం కావడంతో సొంత జిల్లా ప్రజల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి.

ప్రాజెక్టు నేపథ్యం

దివంగత సీఎం ఎన్టీ రామారావు రాయలసీమలో కరువు శాశ్వత నివారణ కోసం గాలేరు - నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు రెండవ దశలో 8 నుంచీ 14 వరకూ మొత్తం ఏడు ప్యాకేజీల కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాకు నీరందించాల్సి వుంది. తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాల్లో 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి వుంది. దీనికోసం ఉమ్మడి కడప జిల్లా నుంచీ శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్ళు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా నీరు రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు చేర్చాలి. అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్‌కు, ఆపై పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచి మిగిలిన రిజర్వాయర్లను కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్ళతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ. 2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. 2008లో మళ్ళీ అంచనాలను రూ. 2526 కోట్లకు సవరించింది. పనులకు అనుమతి ఇచ్చిన నాటి వైఎస్ ప్రభుత్వం పనులు మాత్రం మొదలు పెట్టలేదు. దీంతో 2014 వరకూ ఆరేళ్ళ పాటు ప్రాజెక్టు మరుగునపడింది.

ప్రాజెక్టుకు ప్రాణం పోసిన చంద్రబాబు

2014లో చంద్రబాబు సీఎం కాగానే సొంత జిల్లాలో మరుగున పడిన గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోశారు. రూ. 2526 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. ఆయన చొరవతో జిల్లా యంత్రాంగం పరుగులు



పెట్టింది. భూసేకరణ పనులు జోరందుకున్నాయి. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు సంబంధించి ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట నిర్మాణం, అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్ వరకూ కాలువ తవ్వకం పనులు, మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.18 టీఎంసీలుగా వుండగా దాన్ని 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ. 56.08 కోట్లతో పనులు మొదలు కాగా రూ. 25 కోట్ల పనులు చేశారు. వేణుగోపాల సాగర్ అంచనా వ్యయం రూ. 160 కోట్లు. ఇందులో రూ. 35 కోట్ల పనులు పూర్తయ్యాయి. కాలువతో సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు. ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాక టన్నెళ్ళ నిర్మాణం పెండింగ్ పడింది. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రాలేదు. 2019లో ఎన్నికలు వచ్చేటప్పటికీ గాలేరు-నగరి ప్రాజెక్టు పనుల పురోగతి చాలా ఆశాజనకంగా వుండింది.

బాబు హామీ నిలబెట్టుకోవాలి

ఇటీవలి ఎన్నికల్లో చంద్రబాబు తిరిగి సీఎం కావడంతో గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బాలాజీ రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే ఈ పనులను పూర్తి చేస్తానని, జిల్లాలో కరువును శాశ్వతంగా నిర్మూలిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఆయనే ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించిన నేపథ్యంలో ఇపుడు తొలి ప్రాధాన్యత కింద ఈ ప్రాజెక్టును ఎంపిక చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రాజెక్టు పనులను సమీక్షించి, అవసరమైన అంచనాలు రూపొందించాలని, ఆ మేరకు నిధులు మంజూరు చేసి వేగంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతున్నారు.

జగన్ రాకతో టెండర్లు రద్దు... డిజైన్ మార్పు

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి జగన్ సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. పనులన్నీ ఆగిపోయాయి. నిధులూ విడుదల కాలేదు. 2020 జూలై 8న ప్రభుత్వం టెండర్లు రద్దు చేసింది. పాత డిజైన్ ప్రకారం పనులు చేపడితే రామచంద్రాపురం మండలంలో ప్రతిపాదిత పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్ల పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుందని, భూముల విలువ విపరీతంగా పెరిగిపోయినందున భూసేకరణ ప్రభుత్వానికి భారమవుతుందన్న వాదన తెరపైకి తెచ్చింది వైసీపీ ప్రభుత్వం. ఆ వంకతో ఆ రెండు రిజర్వాయర్లనూ రద్దు చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచీ కాలువ తవ్వి నీటిని గాలేరు-నగరి కాలువకు మళ్ళించేలా ప్రత్యామ్నాయ డిజైన్‌ను రూ. 5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో రూపొందించారు. అయితే అప్పటి నుంచీ ఆ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదానికి నోచుకోలేదు. దీంతో ఐదేళ్ళ పాటు ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. మరోవైపు పాత టెండర్లు రద్దయ్యాయి. రీ టెండర్లు పిలవలేదు. డిజైన్ కూడా మార్చివేసినా దానికీ అనుమతులు లేవు. నిధులూ ఇవ్వలేదు. అటవీ శాఖ అనుమతులు కూడా సాధించలేదు. ఫలితంగా గత వైసీపీ ప్రభుత్వం గాలేరు-నగరి ప్రాజెక్టు ఊపిరి తీసేసినట్టయింది.

రేపు యూపీఎస్సీ పరీక్షలు


హాజరు కానున్న 1,199మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 12: యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షలు జిల్లాలో ఆదివారం జరగనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్-ఎ, వింగ్-బీ)లో, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (వింగ్-ఎ)లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1,199మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి

ఏర్పేడు, జూలై 12 : ఆరేళ్ల చిన్నారిపై పాశవికంగా లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం ప్రకారం ఏర్పేడు మండలానికి చెందిన బలరామయ్య గౌడ్(61) ఓ ఆరేళ్ల చిన్నారిపై కన్నేశాడు.గత ఆదివారం అమ్మానాన్న పొలంవద్దకు వెళ్లడంతో ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారిని చాక్లెట్ ఇచ్చి తన వెంట తీసుకెళ్లాడు.లైంగికదాడికి పాల్పడడంతో చిన్నారి పెద్దగా కేకలు పెట్టింది.దీంతో అమ్మానాన్నకు ఈ విషయం చెబితే కొడతానని బెదిరించి చిన్నారిని వదిలిపెట్టాడు.ఆ రోజు సాయంత్రం స్నానం చేయించే సమయంలో నొప్పిగా ఉందని తల్లికి ఆ చిన్నారి చెప్పింది. ఆర్ఎంపీ దగ్గర చూపించగా మందులిచ్చి పంపాడు. రెండు రోజులు దాటినా నొప్పి తగ్గకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఈ నెల 9వ తేదీ రేణిగుంట సమీపంలోని బాలాజీ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు చిన్నారిపై లైంగికదాడి జరిగినట్లు నిర్ధారించారు.చిన్నారిని తల్లిదండ్రులు మెల్లగా ఏం జరిగిందని అడిగి విషయం తెలుసుకున్నారు.శుక్రవారం ఏర్పేడు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాల ఢీ : ఇద్దరి మృతి


మృతుడు చెంగారెడ్డి (పాతచిత్రం)

రామచంద్రాపురం, జూలై 12 : రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లి-నెత్తకుప్పం ప్రధాన రహదారిలోని వేణుగోపాలపురం సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. నెమళ్లగుంటపల్లికి చెందిన చెంగారెడ్డి(40),గోవర్ధన్(35) వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. ఎస్ఆర్ కమ్మపల్లికి చెందిన దేవరాజులు, అతని బంధువు భరత్ నెత్తకుప్పం నుంచి బుల్లెట్ వాహనంపై ఇంటికి బయల్దేరారు. వేణుగోపాలపురం వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో వెనుక కూర్చున్న చెంగారెడ్డి, కూర్చున భరత్(36)కు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో చెంగారెడ్డిని తిరుపతి రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.భరత్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జడ్పీ కార్యాలయం ఎదుట పులిచర్ల జడ్పీటీసీ మురళీధర్, అతడి అనుచరులు

మాజీ మంత్రి పెద్దిరెడ్డికి మరో షాక్

- పులిచెర్ల వైసీపీ ప్రజాప్రతినిధుల రాజీనామాలు

పుంగనూరు, జూలై 12: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వైసీపీ ప్రజాప్రతినిధులు మరో షాక్ ఇచ్చారు. పులిచెర్ల జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తన పదవికి, పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఈయన మండల వైసీపీలో కీలకనేతగా వ్యవహరించేవారు. తనతో పాటు పదిమంది సర్పంచులు, నలుగురు ఎంపీటీసీ సభ్యులు కూడా రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు. జడ్పీటీసీ పదవికి చేసిన రాజీనామాను చిత్తూరులో జేసీ శ్రీనివాసులుకు అందజేశారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్నపుడు తమను ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తామున్నామని భరోసా కూడా కల్పించలేదని మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై పరోక్షంగా ఆరోపించారు. వైసీపీలో కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాథుడేలేదన్నారు. తమపై దాడులు జరుగుతున్నా ధైర్యం చెప్పే నాయకుడు కరువయ్యారని, తాను బాధతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆ మండలానికి చెందిన మరికొందరు కూడా వైసీపీని వదిలి వదలి టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. ఇటీవల పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్, మరో పదిమంది కౌన్సిలర్లు కూడా వైసీపీకి రాజీనామాలు చేసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోలీసుల ద్వారా ప్రతిపక్షాలపై అణచివేత ధోరణితో వ్యవహరించారు. అధికారం మారగానే అటునుంచి ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా తెలుగుదేశం పార్టీవైపు అడుగులేస్తున్నారు.

నేడు డీజీపీ రాక



తిరుపతి(నేరవిభాగం), జులై 12 : డీజీపీ ద్వారకా తిరుమలరావు రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి రానున్నారు.శనివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకుని పోలీసు అతిథి గృహంలో కాసేపు బస చేస్తారు. అక్కడినుంచి బయలుదేరి తిరుమలకు వెళతారు. రాత్రికి అక్కడే బస చేసి ఆదివారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతిలో రాయలసీమ జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని సమాచారం. తరువాత తిరుచానూరులోని పద్మావతీ దేవిని,కాణిపాకం వెళ్ళి గణనాథుడిని దర్శించుకుంటారు.డీజీపీ హోదాలో మొదటి సారి వస్తుండడంతో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఐషర్‌లో స్నాతకోత్సవ సందడి

ఏర్పేడు, జూలై 12 : ఏర్పేడు మండలం జంగాలపల్లి పంచాయతీ శ్రీనివాసపురం వద్ద వున్న ఐషర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)లో శుక్రవారం ఐదవ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిధిగా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌ఏ మషిల్కర్ హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. కోర్సు పూర్తయిన 167మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. పీహెచ్‌డీ పూర్తయిన విద్యార్థులతో పాటు బీఎస్, ఎంఎస్, బీఎస్సీ పూర్తిచేసిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ స్నాతకోత్సవంలో ఐషర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.




స్నాతకోత్సవంలో డైరెక్టర్ శాంతను భట్టాచార్య, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌ఏ మషిల్కర్ - కేరింతలు కొడుతున్న విద్యార్థులు

చంద్రగిరి పంచాయతీలో అవకతవకలపై విచారణ


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్పీవో వెంకటరమణ తదితరులు

చంద్రగిరి, జూలై 12 : చంద్రగిరి పంచాయతీలో 1.7కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయయని రెండు ఫిర్యాదులందడంతో గూడూరు డీఎల్పీవో వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు విచారణ చేపట్టారు.2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు రూ.50 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయని కలెక్టర్, డీపీవో, డీఎల్పీవో, ఎంపీడీవోలకు ఆకాశరామన్న ఉత్తరాలందాయి. మరో ఫిర్యాదులో 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.1.20కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఎస్బీఐ బ్యాంక్‌లో వ్యక్తిగత ఖాతాను తెరిచి నకిలీ బిల్లులు పెట్టి, నిధులు దొడ్డిదారిన మళ్ళించారని, దీనిపై విచారణ చేపట్టాలని చంద్రగిరి ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అధికారులు గూడూరు డీఎల్పీవో వెంకటరమణతో కమిటీ వేశారు. దీంతో శుక్రవారం చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలోని అన్ని రికార్డులను తనిఖీ చేశారు.దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు డీఎల్పీవో తెలిపారు.ఈవోఆర్డీ శశిరేఖ, పంచాయతీ ఈవో మహేశ్వరయ్య తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు అర్బన్, జూలై 12: పట్టణంలో 132 కేవీ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. గూడూరు పట్టణం, మండలం, చిల్లకూరు ప్రాంతాల ప్రజలు సహకరించాలన్నారు.

● వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి మండలం, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటవలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ రవిచంద్ర తెలిపారు.

●నాయుడుపేట టౌన్: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటసామి తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు.

●తడ: మండలంలోని బీవీపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట కారూరు, బీవీపాళెం, పూడి, రామాపురంలలో సరఫరా ఉండన్నారు.

అటానమస్ హోదా పదేళ్లు పొడిగింపు

'ఆదిశంకర' చైర్మన్ పెంచలయ్య


వివరాలు తెలుపుతున్న పెంచలయ్య

గూడూరు, జూలై 12: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదాను మరో పదేళ్లు పొడిగించినట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. శుక్రవారం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ ఇంజనీరింగ్ కళాశాలకు పది సంవత్సరాల క్రితం అటానమస్ హోదా వచ్చిందన్నారు. ఆ హోదాను మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ ఉన్నత విద్యామండలి సర్టిఫికెట్ జారీ చేసిందన్నారు. ఆదిశంకర కళాశాలను డీమ్డ్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన ఉపాధి అవకాశాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు మెరుగు పరచండి

మున్సిపల్ కమిషనర్‌కు సీపీఎం నాయకుల వినతి



గూడూరు, జూలై 12: మండలంలోని చెన్నూరులో మౌలిక వసతులను మెరు గుపరచాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూరులో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదన్నారు. శ్మశానవాటికను అభివృద్ధిపరచాలన్నారు. కుక్కలను ని యంత్రించాలన్నారు. శెట్టిగారుబీడులో రోడ్లను, కాలువలను అభివృద్ధి చేయాలన్నారు.

చికిత్సకు ఆర్థిక సాయం

గూడూరు, జూలై 12: పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో టీడీపీ కార్యకర్త వైద్యఖర్చుల నిమిత్తం శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ... తమ పార్టీ కార్యకర్త అన్వర్‌బాషా ఇటీవల కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం అన్వర్‌బాషాకు రూ.5వేలు అందజేశారన్నారు. ఉదయ్‌కుమార్, సలీం, పెంచలయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



గూడూరు అర్బన్, జూలై 12: పట్టణంలోని జడ్పీహైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి రాహుకాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతు సమస్యల పరిష్కార వేదిక

గూడూరు అర్బన్, జూలై 12: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి పథకంపై రైతు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ గోపీనాయక్ మాట్లాడుతూ... పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి పథకంలో ప్రధానంగా ల్యాండ్ లింకేజీ, ఈకేవైసీ, రైతులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి ఆగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించి 129 మంది రైతులను అర్హులుగా గుర్తించామన్నారు. ఏవో రమేష్ పాల్గొన్నారు.

జీవ ఎరువులతో నేల సారవంతం

వెంకటగిరి, జూలై 12: జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాలతో నేల సారవంతం అవుతుందని కృషి విజ్ఞాన కేంద్ర అధిపతి డాక్టర్ బీజీ రాజులు చెప్పారు. శుక్రవారం కేంద్రంలో జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాల ప్రాముఖ్యత, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాలతో పంటలకు ఆశించే తెగుళ్ల తగ్గుముఖం పడుతాయన్నారు. అనంతరం రైతులకు జీవ ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు నాగార్జున సాగర్, కేంద్ర శాస్త్రవేత్తలు రాజీవన, పి.నాగార్జున రెడ్డి, డి.తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, జూలై 12 : చోరీపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి సమీపంలో టీ దుకాణం నిర్వహిస్తున్న జగన్‌నాథం ఎప్పటిలాగే గురువారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికెళ్లారు. శుక్రవారం ఉదయం దుకాణం తెరవడానికి వచ్చిన ఆయన తాళాలు పగలగొట్టినట్లు గుర్తించాడు. దుకాణంలోకి వెళ్లి చూడగా అందులోఉన్న రూ.6వేలు, గ్యాస్ సిలిండర్, ఫ్యాన్, ఫ్లాస్కులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

వెంకటగిరి, జూలై 12: ప్రభుత్వం తలపెట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో బాగంగా మండల పరిధిలోని పాపమాంబాపురం పంచాయతీలో శుక్రవారం పరిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కార్యదర్శి నాగమణి, నాయకులు పోలిరెడ్డి తదితరులు ఉన్నారు.

పెళ్లకూరు: ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని ఎంపీడీవో అన్నపూర్ణరావు కోరారు. శుక్రవారం పెళ్లకూరు మిట్ట లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, పూల కుండీలు, కొబ్బరి బొండాలు ఉంచరాదని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు, జూలై 12: మండలంలోని ఈదలపల్లి నుంచి ఆటోలో తరలిస్తున్న 400 కిలోల రేషన్‌బియ్యాన్ని రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు.. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు... మండలంలోని ఈదలపల్లి రేషన్ దుకాణం నుంచి గూడూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాసులు తన ఆటోలో 400 కిలోల రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా వేములపాళెం సమీపంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. బియ్యాన్ని, ఆటోను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యలవాగు గండికి మరమ్మతులు చేపట్టరా?

● యేళ్లు గడుస్తున్నా నిర్లక్ష్యం

● ఇసుక మేటలతో రైతుల ఇబ్బంది



గండిపడిన రొయ్యలవాగు ప్రధాన కాలువ - పొలాల్లో ఇసుక మేటలు

వాకాడు, జూలై 10: ఓ వైపు ప్రకృతి విపత్తులు... మరో వైపు వైసీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో రొయ్యలవాగు ప్రధాన కాలువ దిగువన ఉన్న రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2019లో కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖి లింకు కాలువ నుంచి వేముగుంటపాళెం వచ్చే రొయ్యలవాగు ప్రధాన కాలువ పొర్లుకట్టలు సుమారు 50 మీటర్ల మేర గండిపడింటది. వైసీపీ నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరాలు కావస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. ప్రధాన కాలువకు గండిపడటంతో యేటా నవంబరు, డిసెంబరుల్లో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు ప్రవహిస్తుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ముట్టెంబాక, తిరుమూరు, కోడివాక, తదితర గ్రామాల పరిధిలో సుమారు 2,200 ఎకరాలకు పైగా నీట మురిగే పరిస్థితి. ముట్టెంబాక ఎస్సీ, ఎస్టీ కాలనీలు జలదిగ్బంధంలోనే చిక్కుకొని స్థానికులు తిండి, నిద్రకు కష్టాలుపడాల్సిన పరిస్థితి. దీనిపై పలుమార్లు రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించినా పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యలవాగు ప్రధాన కాలువ గండికి మరమ్మతులు చేపడితే గ్రామాలు నీట ముంపునుంచే కాక రైతులకు కష్టాలు తప్పుతాయి. కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వమైనా దీని గురించి పట్టించుకోవాలని రైతులు, ముట్టంబాక ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ డీఈ సుబ్బారావును వివరణ కోరగా... సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. టెండర్లను త్వరలో ఆహ్వానించి గండిపడిన రొయ్యలవాగు, ప్రధానకాలువ పొర్లుకట్టలను ఆధునీకరిస్తామన్నారు.

వైసీపీ అసమ్మతి నాయకులకు 'నో ఎంట్రీ'

● టీడీపీ అధిష్ఠానం నుంచి సంకేతాలు

● ఎటూ పాలుపోని దువ్వూరు వర్గం

తడ, జూలై 12: ఒకప్పుడు వైసీపీలో అంతా తామై ఓ వెలుగు వెలిగిన ఆ వర్గం ఇప్పుడు ఎటూకాని పరిస్థితిలో పడిపోయిందా... అటు వైసీపీకి దూరమై... ఇటు టీడీపీలోకి రానీవ్వక దిక్కుతోచని స్థితికి చేరుకుందా... అంటే ఔననే సమాధానం వస్తోంది. సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీలో బలమైన నేతగా చెంగాళమ్మ ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఓ వెలుగు వెలిగారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌ను నేరుగా కలిసేవారిలో ఆయన ఒకరు. పార్టీ ఆవిర్భావం నుంచి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు. ఆయనకంటూ ప్రత్యేకంగా వర్గం కూడా ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆయన హవానే నడుస్తుందని అందరూ భావించారు. కొంతకాలం అదే జరిగింది. అయితే 2022 నుంచి అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో మన స్పర్థలు తలెత్తాయి. దీంతో ఆయన వర్గంతో బాహాబాహీకి దిగిన సం దర్భాలున్నాయి. దీంతో ఎన్నికలకు ముందే వారంతా పార్టీ మారుతారంటూ ప్రచారం జరిగింది. గమనించిన వైసీపీ అధిష్ఠానం దువ్వూరుతో మాట్లాడి సర్దుబాటు చేసింది. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో పాటు సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి సుమారు 30 వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. ఆ ఓటమికి ప్రధానంగా దువ్వూరు వర్గమే కారణమంటూ కిలివేటి వర్గం ఆరోపిస్తోంది. అప్పటి నుంచి ఆ విబేధాలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో దువ్వూరు వైసీపీకి రాజీనామాచేసి టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేసినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఆయన వర్గం టీడీపీలోకి చేరిపోతోందంటూ బాహాటంగానే వ్యాఖ్యానించారు. టీడీపీలోని ఓ వర్గం నాయకులు సానుకూలత ప్రదర్శించారు. దీన్ని తెలుగుదేశంలోని ఓ వర్గం అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో వైసీపీ నుంచి ఎవరినీ చేర్చుకోవద్దంటూ స్పష్టమైన సంకేతాలు అధిష్ఠానం పంపి నట్లుగా తెలుస్తోంది. దీంతో దువ్వూరు వర్గం డైలమాలో పడింది. టీడీపీ నుంచి సానుకూల సంకేతాలు వెలువడిన వెంటనే ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి అందరూ కలసి ఆ పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమైన వర్గానికి అధినాయకత్వం ఓ రకంగా షాక్ ఇచ్చిందని చెప్పవచ్చు. అటు వైసీపీలో కొనసాగే పరిస్థితి లేక, ఇటు టీడీపీలోకి వెళ్లలేక తర్జనభర్జన పడుతున్నట్లుగా సమాచారం.

నిమ్మ రైతులకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే కురుగొండ్ల


పరిశోధన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 12: నిమ్మ రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశోధన కేంద్ర ప్రిన్సిపల్ శాస్త్రవేత్త మధు మతికి సూచించారు. శుక్రవారం ఆయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో నిమ్మ జాతులపై జరుగుతున్న ప్రయోగాల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు పరిష్కారానికి చర్యలు చేపట్ట నున్నట్లు తెలిపారు. అదేవిదంగా నిమ్మ రైతుకులకు విరివిగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ సి.సి.నాయుడు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, జూలై 12: నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో 12వ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.రఘురెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అన్నిశాఖలపై సమీక్ష జరిగింది. విద్యుత్ ఏఈ మురళి మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం సోలార్ రూఫ్‌టాప్ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.30వేల రాయితీ ఇస్తుందని చెప్పారు. గత ఏడాది తుఫాన్లకు చెరువు కట్టలన్నీ ధ్వంసమయ్యాయని, వాటిలో 20 చెరువులకు మరమ్మతులు పూర్తయ్యాయని మరో 30 చెరువుల్లో పనులను చేయాల్సి ఉందని ఇరిగేషన్ ఏఈ రమేష్ తెలిపారు. హౌసింగ్ ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ... 2014-19 మధ్య పూర్తైన 418 ఇళ్లకు రూ1.66 కోట్లను లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేదని ప్రస్తుతం బకాయిల వివరాలను సేకరించామన్నారు. ఆగస్టులో ఆ నిధులను లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ... అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, అతిసార ప్రబలకుండా ఆరోగ్యశాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో సర్పంచులు శ్రీనివాసన్, మునిరత్నంరెడ్డి, రమణయ్య, కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్, పలువురు ఎంపీటీసీ సభ్యులు సహా డీఎల్‌పీవో రవీంద్రబాబు, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, డీఎల్‌డీవో వెంకటశేషయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

నీటిపారుదల పథకాలపై ప్రత్యేక శ్రద్ధ

తడ మండలంలో ఉన్న నీటి పారుదల పథకాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని మాజీ ఎంపీ , టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత విజయశ్రీ తొలిసారి తడలో జరిగే సర్వసభ్య సమావేశానికి రావడంతో ఎంపీపీ రఘురెడ్డి, ఉప ఎంపీపీ వెంకటేష్, వైసీపీ నాయకుడు జి.సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించారు. తెలుగుగంగ 8వ బ్రాంచ్ కెనాల్ పనులు మాంబట్టు వద్ద నిలిచిపోయాయని వాటిని పూర్తి చేయిస్తామన్నారు. అలాగే కాళంగి గ్రాయిన్, కాదలూరు వద్ద రిజర్వాయర్, కరిపేటికాలువ, చెక్‌డ్యాంలను నిర్మిస్తామన్నారు. టీడీపీ నాయకులు బి.పళణి, సెల్వం, రవి, శ్యామసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో చెన్నై ఆసుపత్రిలో పోరాడుతున్న విద్యార్థిని


షరీనా

డక్కిలి, జూలై 12 : డక్కిలి బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న షరీనా డెంగ్యూ బారిన పడి చెన్నై ఎగ్మూర్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ... డక్కిలి గురుకుల పాఠశాలల్లో చదువుతున్న షరీనా నాలుగైదు రోజుల నుంచి జర్వంతో బాధపడుతుంటే ఇక్కడి సిబ్బంది ఆలస్యంగా గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని చెప్పారు. బుధవారం షరీనాని రాపూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లామని అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం వారి సూచనల మేరకు నెల్లూరుకు తీసుకెళ్లామన్నారు. అయితే అక్కడ కూడా నయం కాకపోవడంతో ప్రస్తుతం చెన్నై ఎగ్మూరు ఆసుపత్రిలో చేర్పామని ప్రస్తుతం ఆమె విషమంగానే ఉందన్నారు. ప్రైవేటుగా మరో ఆసుపత్రికి తీసుకెళ్లే రూ.20 లక్షలు అవుతుందని చెప్పారన్నారు. అంత స్తోమత తమకు లేదని ఎలాగైనా ప్రభుత్వమే తమ బిడ్డను కాపాడాలని కోరుతున్నారు. షరీనాకు జ్వరంగా ఉందంటే స్థానికంగా వైద్యం అందించామని, అప్పుడు ఆ విద్యార్థినికి జ్వరం 99 ఉందని వైద్యులు గుర్తించారన్నారు. అయితే మరుసటి రోజు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారితో షరీనాను పంపించామని కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీదేవి తెలిపారు. కాగా షరీనాను ప్రభుత్వంమే ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ సమావేశం

వాకాడు, జూలై 12: ఆర్టీసీ రీజియన్‌లో గత 5 సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు పి. చంద్రయ్య కోరారు. మండలంలోని స్వర్ణముఖి గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఎన్ఎంయూ నాయకులు, కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీ ఈడీ ఆదేశాల మేరకు 1/2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలన్నారు. రీజియన్ వ్యాప్తంగా డ్రైవర్లకు చదువులేదనే కారణంతో 12, 18, 24, 30 సంవత్సరాల ఇంక్రిమెంట్లు కలపలేదన్నారు. సర్క్యులర్ నిబంధనల ప్రకారం లిటరసీ పరీక్షలు పెట్టి వారికి ఏఎస్ ఇంక్రిమెంట్లు కలిసేలా చూడాలని కోరారు. చదువులేని గ్యారేజీ సిబ్బందితో కూడా అదే తరహాలో ఇంక్రిమెంట్లు కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఉమ్మడి జిల్లా జోనల్ అధ్యక్షుడు డీవీఆర్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పెరుమాల్, జిల్లా కార్యదర్శి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై కోర్టును ఆశ్రయించిన గ్రామస్తులు


న్యాయస్థానం వద్ద పూడేరువాసులు

నాయుడుపేట టౌన్, జూలై 12: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో నిబంధనలను తుంగలో తొక్కి అడ్డూఅదుపూ లేకుండా గ్రావెల్‌ను తరలించారని నాయుడుపేట మండలం పూడేరు పంచాయతీ వాసులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. శుక్రవారం నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జికోర్టులో అర్జీ అందజేశారు. పూడేరు పంచాయతీలో ఓ వైసీపీ మహిళా నేత అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండ డంతో అప్ప ట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకో లేదని, దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. గ్రావెల్ అక్రమ తర లింపునకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం


అవగాహన కల్పిస్తున్న జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం

గూడూరు, జూలై 12: ద్విచక్ర చోదకులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలకు లోనైతే తీవ్రగాయాలపాలు కాకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో దోహదపడుతుందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలకు లోనైతే మృతిచెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి లోకనాథం, ఏఎంవీఐ ప్రభాకర్, పట్టణ సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముట్టెంబాకలో 'నేడు బడికిపోతా'


బడిఈడు పిల్లలను బైక్‌పై తీసుకువస్తున్న శ్రీనివాస్

వాకాడు, జూలై 12: పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు... బడిలో అంటూ ఉపాధ్యాయుడు పి. శ్రీనివాస్ రొయ్యల గుంటల వద్ద ఉన్న బడి ఈడు పిల్లలను శుక్రవారం తన బైక్‌పై పాఠశాలకు తీసుకువచ్చారు. మండలంలోని ముట్టెంబాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులతో కలసి పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి బడికి తరలించారు. పాఠశాలకు వచ్చిన పిల్లలకు పలక, బలపం, పెన్సిల్ తదితర సామ గ్రిని శ్రీనివాస్ తన సొంత నిధులతో అందిస్తున్నాడు. స్టూడెంట్ కిట్లను హెచ్ఎం రమణయ్య అందజేశారు.

కోట: బడి ఈడు పిల్లల కోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ శ్రీధర్ తెలిపారు. కోట పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంఈవో మస్తానయ్యతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. మొదటగా పాఠశాలలో విద్యార్థులకు వండిపెడుతున్న భోజనాన్ని రుచిచూడడమే కాకుండా వారితో కలిసి తిన్నారు. అక్కడ నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని హాజరుపట్టికను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, కోడిగుడ్లు, సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సత్యవేడు, ఓజిలి, తిరుపతి అర్బన్‌లోని శేషాద్రినగర్‌లో ప్రత్యామ్నాయ పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు సీట్లు

చిల్లకూరు/ కోట/నాయుడుపేట, జూలై 12: చిల్లకూరు మండలంలోని చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన బినితశ్రీ అనే విద్యార్థిని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు పొందింది. కోట పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులానికి చెందిన 11మందిలో ఇద్దరు నూజివీడు, తొమ్మిది మంది ఇడుపులపాయకు ఎంపికయ్యారు. నాయుడుపేట మండలం పుదూరు గురుకులానికి చెందిన నలుగురు విద్యార్థినులు ఇడుపులపాయ, ప్రకాశంలోని ట్రిపుల్ ఐటీలో ప్రవేశం లభించింది.

పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా...

కారు అదుపు తప్పి బోల్తా

యువకుడి మృతి, ముగ్గురికి స్వల్పగాయాలు



నుజ్జునుజ్జైన కారు - బాలు మృతదేహం

చంద్రగిరి, జూలై 12: పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో పెళ్లి కుమారుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం ఎం.కొంగర వారిపల్లె వద్ద జాతీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు బాలు(26) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. అయితే బాలు పెళ్లి చూపులు కోసమని బాలుతోపాటు సోదరుడు వాసు, తల్లి శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్‌లు బెంగళూరులో బుధవారం రాత్రి 9 గంటలకు కారులో బయలుదేరి గురువారం ఉదయం 11.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా భీమవరం వెళ్లారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు కారులో బెంగళూరుకు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలోని చంద్రగిరి మండలం, ఎం.కొంగర వారిపల్లె సమీపంలోకి రాగానే ఆవు అడ్డం రావడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పెళ్లి కుమారుడు బాలు తలకు తీవ్రగాయాలు కాగా, శంకరమ్మ చెయ్యి విరిగింది. దిలీప్, వాసుకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, బాలు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రమాదేవి మృతదేహం

భాకరాపేట, జూలై 12: భాకరాపేట ఘాట్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. భాకరాపేట ఎస్ఐ విజయకుమార్ నాయక్ కథనం మేరకు... చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ దిగువ జూపల్లెకు చెందిన రమాదేవి(36) తన తమ్ముడు శ్రావణ్, కుమార్తె లక్ష్మీశిశిరతో కలిసి ద్విచక్ర వా హనంలో శుక్రవారం తిరుపతి నుంచి స్వగ్రామానికి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యంలో ద్విచక్రవాహనం చెడిపోవడంతో ఆమె తన తమ్ముడు, కుమార్తెను దానిని తీసుకురమ్మని చెప్పి ఆటోలో బయలుదేరింది. ద్విచక్రవాహనం తోసుకువస్తున్న వారికి మంచి నీళ్ల బాటిల్ అందించేందుకు ఆటో నుంచి దిగి రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాదేవికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వారు హుటాహుటిన భాకరా పేట పీహెచ్‌సీకి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తన తల్లిని భాకరాపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు, సిబ్బందిని ఆక్సిజన్ పెట్టమని అభ్యర్థించినా వారు పట్టించుకోలేదని, ఆ తరువాత ఆక్సిజన్ అమర్చినా అది పనిచేయలేదని కుమార్తె లక్ష్మీశిశిర కన్నీరు మున్నీరయ్యారు. ఈ విషయమై వైద్యాధికారి అలెగ్జాండర్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి తీసుకువచ్చేటప్పటికే రమాదేవి మృతి చెందిందని, ఆ విషయం తాము ఆమె కుటుంబసభ్యులకు తెలియ జేశామన్నారు. అయినా వారు వినకుండా ఆక్సిజన్ పెట్టమని కోరారని, ఆక్సిజన్ పెట్టినా ఫలితం లేకపోయిందన్నారు.

శ్రీసిటీ టాటా స్మార్ట్‌ఫుడ్స్ పరిశ్రమకు లీడ్ ప్లాటినం సర్టిఫికెట్



శ్రీసిటీ, జూలై 12: శ్రీసిటీలో ఆహార ఉత్పత్తులను తయా రు చేసే ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టాటా స్మార్ట్ ఫుడ్స్ లిమి టెడ్ (టీఎస్ఎఫ్ఎల్) ప్రతిష్ఠాత్మక యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి లీడ్ ప్లాటినం సర్టిఫికెట్ అందుకుంది. సుస్థిర పర్యావరణ లక్ష్యాలను సాధించే సంస్థలను గుర్తించే లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ డిజైన్ (ఎల్ఈఈడీ) సర్టిఫికేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పని సామర్థ్యం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర పరికరాల వినియోగం వంటి కీలక అంశాల్లో అసాధారణ పనితీరు కొల మానాలుగా టాటా స్మార్ట్‌ఫుడ్స్ సంస్థ లీడ్‌ప్లాటినం సర్టిఫికెట్ సొం తం చేసుకుంది. పర్యావరణ బాధ్యత, పని సామర్థ్యం పట్ల తమ నిబద్ధతను ఇది ధృవీకరిస్తుందని సంస్థ అసోసియేట్ డైరెక్టర్, ఫ్యాక్టరీ హెడ్ పురు షోత్తమన్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు వరించడం పట్ల శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి టాటా స్మార్ట్‌ఫుడ్స్ బృందానికి అభినందించారు.